VELTHURU TELUGU DAILAY
# వెలుతురు
తెలుగు దిన పత్రిక
హైదరాబాద్
బుధవారం 08.04.2026
SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA I ANDHRA PRADESH
సంపుటి: 07 సంచిక: 300
పేజీలు: 12 వెల: రూ. 5/
Velthuru Newspaper




## కల్లియాస్సేరి నియోజకవర్గంలో భారీ రోడ్ షో

యూడీఎఫ్‌కు పెరుగుతున్న ప్రజా మద్దతు

రోడ్ షో పాల్గొన్న ఏఐసీసీ పరిశీలకులు హర్కర వేణుగోపాల్ రావు

3



# వేల కోట్లు దోచేశారు..!

ఒక్క ఏడాదిలోనే సైబర్ నేరగాళ్ల వల

దేశవ్యాప్తంగా రూ.35 వేల కోట్ల మళ్లింపుపై ఈడీ ఆరా

252 ప్రధాన కేసుల్లో రూ.35,925 కోట్ల దారి మళ్లింపు గుర్తింపు

అనుమానిత ఖాతాదారులకు నోటీసులిచ్చే అవకాశం

నేరగాళ్లు కూడబెట్టిన ఆస్తుల జప్తుకు ఈడీ సిద్ధం

బాధితులకు డబ్బులు తిరిగి అందించడమే ప్రధాన లక్ష్యం

న్యూఢిల్లీ, వెలుతురు, ఏప్రిల్ 7 :
దేశవ్యాప్తంగా పెరుగుతున్న సైబర్ నేరాల వెనుక ఉన్న అంతిమ లబ్ధిదారులను గుర్తించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దృష్టి సారించింది. అమాయకుల బ్యాంకు ఖాతాల నుంచి మోసపూరితంగా దారి మళ్లించిన నిధులు, వాటితో నేరగాళ్లు కూడబెట్టుకున్న ఆస్తులను జప్తు చేసే దిశగా చర్యలు ప్రారంభించింది. ఈ క్రమంలో అనుమానాస్పద లావాదేవీలు జరిగిన ఖాతాదారులకు నోటీసులు జారీ చేసి విచారణ చేపట్టే అవకాశం ఉంది.

**వేల కోట్ల మోసాలు**

పల్లె, పట్టణం అనే తేడా లేకుండా సైబర్ నేరగాళ్లు విస్తృతంగా మోసాలకు పాల్పడుతున్నారు. అమాయకులతో పాటు ఉన్నత విద్యావంతులు, అధికారులు కూడా ఈ మోసాలకు బలవుతున్నారు. హైదరాబాద్‌లో ఒక వ్యక్తి రూ.16 కోట్లు కోల్పోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. 2025లో దేశవ్యాప్తంగా రూ.22,495 కోట్లు, 2024లో రూ.22,845 కోట్ల మేర సైబర్ మోసాలు జరిగినట్లు అంచనా.క్షణ లేదు అని చెప్పడానికి కాగ్ రిపోర్టు నిదర్శనం. బడ్జెట్లలో చెప్పేది ఒకటి, ఆచరణలో

..మిగతా 2లో

# కేరళంలో పంచాయతీరాజ్ విజయం

కాంగ్రెస్ హయాంలోనే సాధ్యమైంది

విజయన్ మా సవాల్‌ను స్వీకరించి తెలంగాణ రావాలి

కోవలం ప్రచారంలో తెలంగాణ సీఎం రేవంత్



త్రివేండ్రం, వెలుతురు, ఏప్రిల్ 7:
కేరళంలో పంచాయతీరాజ్ వ్యవస్థ విజయం సాధించిందని, దానిని తాము అభినందిస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ ఘనత కాంగ్రెస్ ముఖ్యమంత్రులు కరుణాకరన్, ఊమెన్ చాందీలదని, ఎక్కడైనా మంచి జరిగితే అభినందిస్తామని చెప్పారు. కేరళం అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కోవలంలో యూడీఎఫ్ తరపున ప్రచార కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ప్రస్తుత సీఎం పినరయి విజయన్ హయాంలోని వైఫల్యాలను ఎత్తిచూపానంటూ ఆయన హయాం ముగిసిందని, 120నెలల విజయన్ పాలనా కాలం వైఫల్యానికి ప్రతీకగా నిలిచిందని విమర్శించారు

..మిగతా 2లో

## మావోయిస్టు విముక్త తెలంగాణ

డీజీపీ శివధర్ రెడ్డి

2

తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో పర్యటన, పామునూరులో పోలీస్ ఔట్‌పోస్ట్‌కు శంకుస్థాపన





## యూరియాను శాస్త్రీయంగా వాడాలి

3

'రైతు నేస్తం'లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల



## ప్రజారోగ్యమే సమాజానికి బలమైన పునాది

3

'వరల్డ్ హెల్త్ డే' లో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్



## లష్కరే తొయిబా ముఠా అరెస్టు

2

16 ఏళ్లుగా పరారీలో ఉన్న పాక్ ఉగ్రవాదిని పట్టుకున్న పోలీసులు

## మూడు రోజుల పాత బిర్యానీ డెలివరీ

హోటల్ సీజ్

2

ఆన్‌లైన్ ఆర్డర్‌లో కుళ్లిపోయిన బిర్యానీ వెలుగులోకి*

ఫ్రిడ్జ్‌లో 80 ప్యాకెట్లు నిల్వ ఉంచినట్టు గుర్తింపు

అపరిశుభ్ర వాతావరణంలో ఎలుకలు, బొద్దింకలు సంచారం

హోటల్ యజమానిపై కేసు



## రెండు వారాల్లో పరిష్కరిస్తాం



పోలీస్ స్టేషన్లలో సీసీటీవీల ఏర్పాటు, నిర్వహణపై సుప్రీం కోర్టుకు కేంద్రం హామీ

3

## సమాచార సమగ్రత పరిరక్షకులు ఐఏఎస్ అధికారులు

బలాన్ని కాకుండా మేధస్సుతో చేసే సమాచార యుద్ధంలో అగ్రభాగాన నిలవండి

కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అట్టడుగువారికి చేరేలా సమాచార వ్యాప్తి చేయండి

ఐఏఎస్ ట్రైనీ అధికారులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ సూచన

2009, 2023, 2024 ఐఏఎస్ ట్రైనీ అధికారులతో కేంద్ర మంత్రి భేటీ



3



మహబూబ్ నగర్ జిల్లాను సస్యశ్యామలం చేయడమే

## కాంగ్రెస్ సంకల్పం

డీసీసీ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

'సంఘటన్ శ్రీజన్ అభియాన్' సమావేశంలో టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

3



## రేవంత్‌ది గడీల, బేడీల, గుడ్డి పాలన

2

పరిగిలో భూములు లాక్కునే యత్నం

రైతుల పరామర్శకు వెళ్తున్న హరీష్‌రావు తదితరుల అరెస్ట్

శంషాబాద్ పీఎస్ వద్ద సీఎంపై విరుచుకుపడ్డ హరీష్

## తెలంగాణ ఆడిట్ శాఖ దేశంలోనే నెంబర్ వన్

గుజరాత్ ఆడిట్ శాఖ ఉన్నతాధికారులతో భట్టి



3




# వేల కోట్లు దోచేశారు..!

(మొదటి పేజీ తరువాయి)

చేసేది మరొకటి అని రిపోర్టు తేటతెల్లం చేసింది. అంచనాలకు, చేస్తున్న ఖర్చులకు ఏమాత్రం పొంతనలేకుండా ఉంది. సంక్షేమ రంగానికి,

**ఫిర్యాదుల్లో జాప్యంతో నష్టం**

సైబర్ నేరాలను నియంత్రించేందుకు కేంద్రం ప్రత్యేకంగా ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (I4C) ఏర్పాటు చేసింది. మోసం జరిగిన వెంటనే 1930 నంబరుకు ఫోన్ చేస్తే డబ్బు మరింత దారి మళ్లకుండా అడ్డుకునే అవకాశం ఉంటుంది. అయితే చాలామంది ఆలస్యంగా ఫిర్యాదు చేయడంతో నష్టాలు పెరుగుతున్నాయి.

**రూ.55 వేల కోట్ల నష్టం**

2020 నుంచి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా సైబర్ నేరాల వల్ల సుమారు రూ.55 వేల కోట్ల నష్టం సంభవించింది. అందులో రూ.8,690 కోట్లను మాత్రమే తిరిగి పొందగలిగారు. మిగతా డబ్బును నేరగాళ్లు వివిధ మార్గాల్లో మాయంచేశారు. 252 కీలక కేసుల్లోనే రూ.35,925 కోట్లకు పైగా నగదు మళ్లింపును ఈడీ గుర్తించింది.

**ఖాతాదారులపై విచారణ**

సైబర్ నేరాలకు సంబంధించిన లావాదేవీలు ఎక్కువగా బ్యాంకు ఖాతాల ద్వారానే జరిగాయని గుర్తించిన అధికారులు, ఆ ఖాతాదారులతో నేరగాళ్లకు ఉన్న సంబంధాలపై ఆరా తీస్తున్నారు. డబ్బు చివరకు ఎవరి ఖాతాలో జమైందో, ఆ సొమ్మును ఎలా వినియోగించారో తెలుసుకునేందుకు విచారణ చేపట్టనున్నారు.

**ఆస్తుల జప్తు, బాధితులకు న్యాయం**

నేరగాళ్లు కూడబెట్టుకున్న ఆస్తులను జప్తు చేసి, న్యాయస్థానం ఆదేశాల మేరకు బాధితులకు పంపిణీ చేయడమే ఈడీ ప్రధాన లక్ష్యంగా పెట్టుకుంది. క్రిప్టో రూపంలో విదేశాలకు తరలించిన నిధులపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టినట్లు సమాచారం. ఇటీవల భారీ స్థాయిలో సైబర్ మోసాలు వెలుగులోకి రావడం దేశవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తోంది.

# మూడు రోజుల పాత బిర్యానీ డెలివరీ

హైదరాబాద్, వెలుతురు, ఏప్రిల్ 7:

నేటి ఆధునిక జీవన విధానంలో స్మార్ట్ ఫోన్ వినియోగం పెరగడంతో ఫుడ్ డెలివరీ యాప్‌ల ద్వారా ఆహారం ఆర్డర్ చేయడం సాధారణంగా మారింది. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని అనేక హోటళ్లు తమ వ్యాపారాన్ని విస్తరిస్తున్నాయి. అయితే కొంతమంది వ్యాపారులు నాణ్యతను పట్టించుకోకుండా వినియోగదారుల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. హైదరాబాద్ నగరంలో ఆన్‌లైన్ ద్వారా ఆర్డర్ చేసిన బిర్యానీ కుళ్లిపోయిన స్థితిలో డెలివరీ కావడంతో హోటల్ యాజమాన్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. మూడు రోజుల క్రితం తయారుచేసిన ఆహారాన్ని ఫ్రిడ్జ్‌లో నిల్వ ఉంచి, ఆర్డర్ వచ్చినప్పుడు వేడి చేసి పంపిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 2 ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఆదివారం ఉదయం Zomato యాప్ ద్వారా చికెన్ బిర్యానీ ఆర్డర్ చేశారు. అదే ప్రాంతంలోని "లక్కీ బిర్యానీ షావర్మ" రెస్టారెంట్ నుంచి వచ్చిన బిర్యానీ పొట్లం తెరిచి చూడగా దుర్వాసన రావడంతో అనుమానం వ్యక్తమైంది. పరిశీలించగా బిర్యానీ కుళ్లిపోయినట్లు గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు హోటల్‌లో తనిఖీలు చేపట్టగా పలు అనుమానాస్పద విషయాలు బయటపడ్డాయి. ఫ్రిడ్జ్‌లో సుమారు 80 బిర్యానీ ప్యాకెట్లు నిల్వ ఉంచినట్లు గుర్తించారు. అలాగే ఫ్రిడ్జ్‌లో ఎలుకలు సంచరిస్తున్న దృశ్యాలు కూడా కనిపించాయి. దర్యాప్తులో భాగంగా జీడిమెట్ల ప్రాంతానికి చెందిన హోటల్ యజమాని ఇర్ఫాన్ మూడు రోజుల క్రితం తయారుచేసిన బిర్యానీని ప్యాకెట్లుగా సిద్ధం చేసి బంజారాహిల్స్ అవుట్‌లెట్‌లో నిల్వ ఉంచి, ఆర్డర్ వచ్చినప్పుడు వేడి చేసి పంపిస్తున్నట్లు పోలీసులు నిర్ధారించారు. అపరిశుభ్ర పరిస్థితులు, దుర్వాసనలు, ఎలుకలు, బొద్దింకలతో నిండిన ఆ హోటల్‌ను అధికారులు సీజ్ చేశారు. అలాగే హోటల్ యజమాని ఇర్ఫాన్‌పై కేసు నమోదు చేశారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు కూడా తనిఖీలు నిర్వహించి ఘటనపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నగరంలో ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కల్తీ వ్యాపారులపై పోలీసులు నిఘా పెంచారు. నిబంధనలను అతిక్రమించి వ్యాపారం నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా పాడైన ఆహార పదార్థాలు విక్రయిస్తున్నట్లు తెలిసిన వెంటనే HFAST నంబర్ 8712661212కు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.



# రేవంత్‌ది గడీల, బేడీల, గుడ్డి పాలన

హైదరాబాద్, వెలుతురు, ఏప్రిల్ 7:

పరిగిలో భూముల లాక్కొని తన సోదరుడికి కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై బీఆరఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు నిప్పులు చెరిగారు. ఆరు గ్యారెంటీలు వంద రోజుల్లో పూర్తి చేస్తామన్నారు.. 900 రోజులైనా ఎందుకు పూర్తి చేయలేదంటూ సూటిగా ప్రశ్నించారు. శంషాబాద్ పోలీస్ స్టేషన్ వద్ద మంగళవారం ఆయన మాట్లాడుతూ రేవంత్.. నువ్వు మళ్ళీ గెలవడం కాదు కదా ప్రతిపక్ష హోదా కూడా నీ పార్టీకి రాదని జోస్యం చెప్పారు. ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తున్నారని చెప్పారు. పరిగిలో రైతులను పరామర్శించేందుకు వెళ్తుంటే తమను అరెస్టు చేశారన్నారు. రేవంత్ రెడ్డిది గడీల పాలన.. బేడీల పాలన.. గుడ్డి పాలన అంటూ అభివర్ణించారు. సాగుకు పనికిరాని భూముల్లో పరిశ్రమలు పెట్టాలని ప్రభుత్వానికి సూచించారు. ఎస్సీ, ఎస్టీ రైతులు సాగు చేసుకుంటున్న భూములను ఎందుకు లాక్కుంటున్నారంటూ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. బోగస్ మాటలు.. బోగస్ పాలన అంటూ రేవంత్ పరిపాలనను ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డికి మించిన రావణాసురుడు ఎవరైనా ఉన్నారా అని ఈ సందర్భంగా హరీష్ రావు ప్రశ్నించారు. పోలీసు నిర్బంధం, అణచివేతల మధ్య హరీష్‌రావు, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర రెడ్డి, దివాకర్ రావు, మాజీ చైర్మన్ ఎర్రోళ్ల దయాకర్‌రావులతో కలిసి పరిగి రైతుల వద్దకు బయల్దేరారు. మార్గంమధ్యలో అప్పా జంక్షన్ వద్ద వారిని పోలీసులు అడ్డుకున్నారు. హరీష్‌రావు కాన్వాయ్ ముందుకు వెళ్లకుండా లారీలను రోడ్డు□□ద్దంగా పెట్టారు. హరీష్‌రావును అరెస్టు చేసేందుకు యత్నించారు. ఈ క్రమంలో పోలీసులు, బీఆరఎస్ నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం నెలకొంది. బీఆరఎస్ శ్రేణులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. దీంతో అప్పా జంక్షన్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. వారందరినీ శంషాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



**రేవంత్ ఆలోచనలన్నీ భూముల చుట్టూనే.**

సూర్యుడి చుట్టూ భూమి తిరుగుతది అన్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలు అన్నీ భూమి చుట్టే తిరుగుతున్నయి అని అసెంబ్లీలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి.హరీష్‌రావు వ్యాఖ్యానించారు. లగచర్ల అంటడు.. హెచ్‌సీయూ అంటడు.. హిల్‌ట్‌పీ అంటడు.. నాదర్‌గుల్ భూములు అంటడు.. ఇవ్వాళ పరిగిలో భూములు లాక్కుంటడు.. పాలన చేయమంటే భూముల మీద పడ్డడు అని విమర్శించారు. నాటి ఇందిరమ్మ భూములు ఇస్తే నేటి ఇందిరమ్మ పాలనలో పేదల భూములు లాక్కుంటున్నడన్నారు. పరిగి నియోజకవర్గంలో దళిత, గిరిజన బలహీనవర్గాల భూములను ఇండస్ట్రియల్ పార్కుల పేరిట ప్రభుత్వం గుంజుకునే ప్రయత్నం చేస్తున్నదని, రైతుల పక్షాన పోరాడటానికి తమ నాయకులు వెళ్తుంటే అరెస్టులు చేసి నిర్బంధాలకు గురిచేస్తున్నారని తెలిపారు. ఎందుకు ఈ ప్రభుత్వం అంత భయపడుతున్నదని ప్రశ్నించారు. ప్రధాన ప్రతిపక్షంగా తాము పరిగి రైతుల వద్దకు వెళ్తుంటే అడ్డుకోవడం అప్రజాస్వామికమన్నారు. ప్రజాస్వామ్యం అనే ఏడో గ్యారెంటీ ఇస్తున్నాం.. ప్రజలకు ప్రశ్నించే హక్కు కల్పిస్తం అన్నరు.. ప్రధాన ప్రతిపక్ష పార్టీగా బలహీనవర్గాల గొంతుకగా మాట్లాడుతుంటే ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. తమ మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డిని అరెస్టు చేసి గంటకో పోలీసు స్టేషన్‌కు పంపుతున్నారంటూ మండిపడ్డారు. రైతుల గోస వినడానికి కళ్లాపూర్ దగ్గర మీటింగ్ పెట్టుకున్నామని, ఉదయాన్నే పోలీసులు వెళ్లి టెంట్లు చింపి రైతులను, మహిళలను అరెస్టు చేశారని, అక్కడికొస్తే కేసులు పెడతామని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆయన అన్నారు. ప్రజలకు నిరసన తెలిపే హక్కు లేకుండా చేయడమేనా ప్రజాపాలన అని ప్రశ్నించారు. రేవంతు పరిస్థితి పిచ్చోడు చేతిలో రాయిలా అయిందని, ఎప్పుడు ఎవరి మీద రాయి విసురుతడో తెల్వది.. మూసీ పేరిట అపార్టుమెంట్లు కూల్చుతడు.. హైడ్రా పేరిట పేదల ఇండ్లు కూల్చుతడు.. యూనివర్సిటీ భూములు లాక్కుంటడు.. వ్యవసాయ మార్కెట్ భూములు లాక్కుంటున్నడు.. లగచర్ల లాంటిదే పరిగిలో చేస్తున్నడు అని ఆరోపించారు. దళిత, గిరిజన, బలహీనవర్గాల భూముల మీద రేవంత్ రెడ్డి దండయాత్ర చేస్తున్నడన్నారు. రేవంత్ రెడ్డి వచ్చిన రెండున్నరేండ్లలో పరిశ్రమలు పెడతాం అని నోటిఫికేషన్లు ఇచ్చి 10వేల ఎకరాల దళితుల, ఎస్టీల భూములు లాక్కున్నడు.. ఇంక 40వేల ఎకరాల భూములు లాక్కుంటడట.. ఎందుకు భూముల మీద దండ యాత్ర చేస్తున్నవు అని అడగడానికి వెళ్తున్నం అని అన్నారు. ముఖ్యమంత్రి, స్పీకర్ ఉండి వికారాబాద్ జిల్లాకు శాపం అయ్యిందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీల నోట్లో మట్టికొట్టే ప్రయత్నం చేస్తున్నరంటూ నువ్వు అడ్డుకోవాలని చూసినా మా పోరాటం ఆగదు.. బాజాప్త రైతుల వద్దకు వెళ్తాం.. వాళ్ల పోరాటానికి బాసటగా నిలుస్తం అని హరీష్‌రావు స్పష్టం చేశారు. ఎక్కడ అసైన్డ్ భూమి ఉంటే అక్కడ గద్దల్లా వాలుతున్నారన్నారు. తుమ్మల గారు నేను చెప్పిందే చెప్పారు.. అందుకు ధన్యవాదాలు.. కేసీఆర్ ఆలోచనలతో ఫౌండేషన్ వేసింది, నిధులు ఇచ్చింది తాము.. రెడీగా ఉన్న భూములను ఇండస్ట్రీలకు ఇస్తం, పక్కన పంచాయతీలో ఉన్న దిల్ భూములను మార్కెట్ యార్డుకు ఇస్తం అంటడు.. 11 ఏళ్లుగా హైకోర్టులో కేసు క్లియర్ కాలేదని, మీరు రైతు పక్షపాతి అయితే ఇక్కడే టెండర్ పిలిచి అంతర్జాతీయ ప్రమాణాలతో మార్కెట్ నిర్మించండి అని మంత్రికి హరీష్‌రావు విజ్ఞప్తి చేశారు. భూముల వెంట పడకండి.. 22ఏ నిషేధిత జాబితాపై సమీక్షించి తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇండస్ట్రియల్ నోటిఫికేషన్ ఉపసంహరించుకుని పరిగి రైతులకు భూములు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామని, అప్పటిదాకా తమ పోరాటం ఆగదని ఆయన హెచ్చరించారు.

# కేరళంలో పంచాయతీరాజ్ విజయం

(మొదటి పేజీ తరువాయి)

విజయన్ వైదొలగే సమయం ఆసన్నమైందన్నారు. యూడీఎఫ్ మూడింట రెండొంతుల మెజారిటీతో గెలవబోతున్నదని జోస్యం చెప్పారు. ఊమెన్‌చాందీ తరహా పాలన అందిస్తామన్నారు. కేరళంలో సరైన అవకాశాలు లేకపోవడంతో యువత ఉపాధి కోసం విదేశాలకు వెళ్లారని, దాంతో ఇక్కడ వృద్ధులు చిన్న పిల్లలే కనిపిస్తున్నారంటూ ఇది దురదృష్టకరమని అన్నారు. విద్యావంతులు, నైపుణ్యం ఉన్న యువత విదేశాలకు వెళ్లడం సరికాదన్నారు. వాళ్లు ఇక్కడకు వచ్చి ఉపాధి పొందేలా చేస్తాం, తెలంగాణలో మాదిరే అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ఉద్యోగ నియామకాలు, స్వీయ ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడం వంటివి కేరళంలో అమలు చేస్తాం అని హామీ ఇచ్చారు. విజయన్‌తోపాటు కేరళం కమ్యూనిస్టు మహిళా నాయకులను తాను తెలంగాణకు ఆహ్వానిస్తున్నా.. వారికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తాం.. ఏ మూలకైనా వెళ్లి తాము అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించవచ్చు అన్నారు. ఈ విషయంలో విజయన్‌కు సవాల్ విసురుతున్నా.. మేం 67 వేల ఉద్యోగాలు ఇచ్చాం.. 25 లక్షల రైతు కుటుంబాలకు చెందిన రూ.20,670 కోట్ల రుణ మాఫీ చేశాం.. 4 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం.. 200 యూనిట్లు లోపు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం.. రూ.500కే గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తున్నాం అని చెప్పారు. ఎన్నికలు కేరళం.. తెలంగాణ మధ్య కాదు యూడీఎఫ్.. ఎల్డీఎఫ్ మధ్య జరుగుతున్నాయి.. మేం ఏం చేస్తున్నామో అది చెబుతున్నాం.. మా సవాళ్లకు విజయన్ సమాధానం ఇవ్వాలి అని రేవంత్‌రెడ్డి కోరారు. ఈ సందర్భంగాఏఎన్ఐతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ విజయన్ తనకు రాసిన లేఖలో 2014 23 మధ్య విషయాలను ప్రస్తావించారు.. ఆ కాలంలో పినరయి విజయన్ సన్నిహిత మిత్రుడు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నారని చెప్పారు. ఆయన లేఖలోని తప్పులన్నీ జరిగినందునే తెలంగాణ ప్రజలు కేసీఆర్‌ను మార్చివేశారు.. ఇప్పుడు విజయన్‌ను కేరళం ప్రజలు మార్చివేస్తారు.. విజయన్‌పై శబరిమల బంగారం చోరీ, బంగారం స్మగ్లింగ్ కేసులున్నాయి అని గుర్తు చేశారు. విజయన్ గాడ్‌ఫాదర్ నరేంద్ర మోదీ దిల్లీలో ఉన్నారని, మోదీనే ఈ కేసులన్నింటి నుంచి విజయన్‌ను రక్షిస్తున్నారని విమర్శించారు. దేశం కోసం తమ జీవితాలను, ఆస్తులను త్యాగం చేసిన గాంధీ కుటుంబాన్ని రకరకాల కేసులతో వేధిస్తున్నారన్నారు. కేజ్రీవాల్ సహా అనేకమంది నేతలను ఈడీ కేసులతో వేధించి అరెస్టు చేసిన వాళ్లు ఎందుకు విజయన్ జోలికి రావడం లేదని ప్రశ్నించారు. నరేంద్ర మోదీ విజయన్ మధ్య ఉన్న అవగాహనతోనే కేసులు, అరెస్టులు లేవు అని ఎద్దేవా చేశారు. మోదీ.. విజయన్ బంధాన్ని కేరళం ప్రజలు అర్థం చేసుకున్నారు.. సరైన నిర్ణయం తీసుకుంటారు.. కేరళంలో మార్పు వస్తుంది అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.



# లష్కరే తొయిబా ముఠా అరెస్టు

*** 16 ఏళ్లుగా పరారీలో ఉన్న పాక్ ఉగ్రవాదిని పట్టుకున్న పోలీసులు**

శ్రీనగర్:వెలుతురు, ఏప్రిల్ 7:

శ్రీనగర్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న అంతర్రాష్ట్ర లష్కరే తొయిబా ఉగ్ర ముఠాను జమ్ము కశ్మీర్ పోలీసులు ఛేదించారు. ఈ చర్యల్లో ఇద్దరు పాక్ ఉగ్రవాదులతో పాటు ముగ్గురు స్థానికులను అదుపులోకి తీసుకున్నారు. పాకిస్థాన్‌కు చెందిన అబ్దుల్లా అలియాస్ అబు హురైరా అనే ఉగ్రవాది గత 16 ఏళ్లుగా భద్రతా బలగాలకు చిక్కకుండా తిరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. జమ్ము కశ్మీర్ వెలుపల ప్రాంతాలకు కూడా లష్కరే తొయిబా కార్యకలాపాలను విస్తరించడంలో అతడి పాత్ర ఉన్నట్లు వెల్లడించారు. మరో పాక్ ఉగ్రవాది ఉస్మాన్ అలియాస్ కుబైబ్‌ను ఈ నెల 6న అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్‌తో అతడికి సంబంధాలు ఉన్నట్లు విచారణలో తేలినట్లు పేర్కొన్నారు. జమ్ము కశ్మీర్, రాజస్థాన్, హరియాణా రాష్ట్రాల్లోని 19 ప్రాంతాల్లో పోలీసులు ఒకేసారి సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఆయుధాలు, నకిలీ గుర్తింపు పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఇతర రాష్ట్రాల చిరునామాలతో తయారు చేసిన నకిలీ పత్రాలను ఉపయోగించి నిందితులు దేశవ్యాప్తంగా సంచరిస్తున్నట్లు గుర్తించారు. గత నెల 31న శ్రీనగర్‌కు చెందిన నకీబ్ భట్ అనే వ్యక్తి పోలీసులకు చిక్కడంతో ఈ ఉగ్ర ముఠా వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అతడు ఇచ్చిన సమాచారంతో మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ నిందితులు పాక్ ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించడంతో పాటు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిపారు.



# మావోయిస్టు విముక్త తెలంగాణ

ములుగు,వెలుతురు, ఏప్రిల్ 7:

తెలంగాణ రాష్ట్రం మావోయిస్టు విముక్త ప్రాంతంగా మారిందని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రం నుంచి కొద్దిమంది మాత్రమే ఉద్యమంలో ఉన్నారని, వారు కూడా బయటకు రావాలని కోరుతున్నామని అన్నారు. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీ ప్రాంతంలో ప్రిన్సిపాల్ చీఫ్ ఫారెస్ట్ కన్జర్వేటర్ సువర్ణతో కలిసి డీజీపీ పర్యటించారు. కర్రెగుట్టల ప్రాంతంలోని పామునూరు పోలీస్ ఔట్‌పోస్ట్‌కు భూమిపూజ చేసి, ఇంటర్ ఏజెన్సీ కోఆర్డినేషన్ సెంటర్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ కర్రెగుట్టల్లో రోడ్లు వేయడం శుభపరిణామమని పేర్కొన్నారు. కొన్ని కారణాల వల్ల కర్రెగుట్టల ప్రాంతం చాలా కాలంగా అభివృద్ధికి దూరంగా ఉందని, అక్కడి గూడేల్లో నివసిస్తున్న ప్రజలకు కనీస సౌకర్యాలు అందలేదని తెలిపారు. ప్రస్తుతం రోడ్ల నిర్మాణంతో అభివృద్ధి కార్యక్రమాలకు మార్గం సుగమమవుతోందని పేర్కొన్నారు. ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందాలంటే రోడ్లు అత్యంత కీలకమని అన్నారు. కర్రెగుట్టల ప్రాంతాన్ని మిగతా ప్రపంచంతో అనుసంధానం చేయాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని తెలిపారు.



ఇప్పటి వరకు 13 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం పూర్తయిందని వివరించారు. మున్ముందు ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.పామునూరు గ్రామస్థులకు బియ్యం, నిత్యావసర వస్తువులు, సోలార్ లాంతర్లను డీజీపీ పంపిణీ చేశారు. అటవీ చట్టాలను ఉల్లంఘించకుండా కర్రెగుట్టల్లో రోడ్లు నిర్మిస్తున్నామని ప్రిన్సిపాల్ చీఫ్ ఫారెస్ట్ కన్జర్వేటర్ సువర్ణ తెలిపారు. ఈ ప్రాంతంలో ఎకో టూరిజం అభివృద్ధికి మంచి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

ఇక రోడ్డు భద్రతపై కూడా డీజీపీ అవగాహన కల్పించారు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలో నిర్వహించిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో పాల్గొని, అజాగ్రత్తగా వాహనాలు నడపడం వల్ల ప్రాణనష్టం జరుగుతుందని హెచ్చరించారు. హెల్మెట్ లేకుండా, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దని సూచించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.

# ప్రజారోగ్యమే సమాజానికి బలమైన పునాది

హైదరాబాద్, వెలుతురు, ఏప్రిల్ 7:

ఆరోగ్యం కోసం ఐక్యంగా.. విజ్ఞాన శాస్త్రానికి మద్దతుగా అనే థీమ్‌తో ఈ సంవత్సరం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, ఇది ఆరోగ్య రంగంలో శాస్త్ర సహకారం, ఆధారిత నిర్ణయాల ప్రాముఖ్యతను గుర్తు చేస్తోందని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. వరల్డ్ హెల్త్ డే సందర్భంగా రవీంద్ర భారతిలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఆరోగ్యం అంటే వ్యాధులు లేకపోవడ□మే కాదు.. శారీరక, మానసిక, సామాజికంగా ఆరోగ్యంగా ఉండడం కూడా అవసరమని, ప్రజారోగ్యమే అభివృద్ధి చెందిన సమాజానికి బలమైన పునాది అని పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్యులు, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది, సపోర్టింగ్ స్టాఫ్ సేవల వల్లే ప్రజల ఆరోగ్యం రక్షితంగా ఉందంటూ కోవిడ్ వంటి క్లిష్ట పరిస్థితుల్లో సేవలందించిన వైద్య సిబ్బందికి మంత్రి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రజారోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రాథమికస్థాయి నుంచి సూపర్ స్పెషాలిటీస్థాయి వరకు ఆరోగ్య సేవలను బలోపేతం చేస్తున్నామని, మౌలిక వసతులు, మానవ వనరులు, ఔషధాలు, డయాగ్నోస్టిక్ సేవలను మెరుగుపరుస్తున్నామని చెప్పారు. జీవన శైలిలో వచ్చిన మార్పులు, ఆహారపు అలవాట్లు, కాలుష్యం తదితర కారణాలతో డయాబెటిస్, బీపీ, గుండె, మూత్రపిండాలు, క్యాన్సర్ వంటి నాన్ కమ్యునికబుల్ వ్యాధులు పెరుగుతున్నాయన్నారు. ఇవి ప్రజలపై ఆర్థిక భారం పెంచుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యాధులను ఎదుర్కొనేందుకు ప్రివెంటివ్, ప్రమోటివ్, క్యూరెటివ్, రిహాబిలిటేటివ్ విధానంతో సమగ్ర ఆరోగ్య సేవలనందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌సీడీ క్లినిక్స్, డే కేర్ క్యాన్సర్ సెంటర్లు, పాలియేటివ్, జెరియాట్రిక్ కేర్ సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. కొత్తగా 79 డయాలిసిస్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, 109 ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేసి అత్యవసర సేవలను బలోపేతం చేస్తున్నామని, రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలను కాపాడేందుకు ప్రతి 35 కి.మీ కు ట్రామా కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని, రూ.1100 కోట్లతో నాలుగు స్థాయిల ట్రామా కేర్ వ్యవస్థను అమలు చేయబోతున్నామని వివరించారు. అంబులెన్స్ సేవలను బలోపేతం చేస్తూ 213 కొత్త వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చామని, త్వరలో మరిన్ని అంబులెన్సులను అందుబాటులోకి తీసుకొస్తామని, 10 నిమిషాల లోపు ఘటనా స్థలానికి అంబులెన్స్ చేరుకునే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. ఈరోజు క్యాన్సర్‌ను నోటిఫైబుల్ వ్యాధిగా ప్రకటిస్తున్నామన్నారు. క్యాన్సర్ రిజిస్ట్రీ ద్వారా ఖచ్చితమైన డేటాతో మెరుగైన ప్రణాళికలు రూపొందిస్తామని, ప్రతి జిల్లాలో డే కేర్ క్యాన్సర్ సెంటర్ల ద్వారా చికిత్సను ప్రజలకు చేరువ చేశామని, ములుగు, ఆదిలాబాద్ వంటి ప్రాంతాల్లో కూడా కీమోథెరపీ సేవలు అందిస్తున్నామని ఆయన తెలిపారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లో పాలియేటివ్ కేర్ అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఈరోజు నిమ్స్‌లో అత్యాధునిక లినాక్ సేవలను ప్రారంభించామని, రాష్ట్రంలో రీజినల్ క్యాన్సర్ కేంద్రాలను కూడా ఏర్పాటు చేసే దిశగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా క్యాన్సర్ వంటి వ్యాధులను ముందుగా గుర్తించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆస్ట్రాజెనెకాతో కలిసి 20 ప్రభుత్వ హాస్పిటళ్లలో లంగ్ క్యాన్సర్ ముందస్తు నిర్ధారణపై పైలట్ ప్రాజెక్టును త్వరలో ప్రారంభిస్తున్నామని, ఇందుకోసం ఆస్ట్రాజెనెకాతో ఒప్పందం చేసుకున్నామని చెప్పారు. ప్రతి పౌరుడికీ□ హెల్త్ ప్రొఫైల్ రూపొందించే దిశగా చర్యలు ప్రారంభించామని, 46 లక్షల మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్టు పోర్టల్‌ను ప్రారంభించామని, పీసీపీఎన్‌డీటీ, ఏఆర్‌టీ, సరోగసీ చట్టాల అమలుకు ప్రత్యేక పోర్టల్స్ తీసుకొచ్చామని, పారదర్శకత, నాణ్యత, బాధ్యతాయుత వ్యవస్థను తయారు చేస్తున్నామని చెప్పారు. ఆరోగ్యశ్రీ సేవలను విస్తరిస్తూ ప్రజల ఆర్థిక భారం తగ్గిస్తున్నామన్నారు. ఉద్యోగులు, పెన్షనర్ల కోసం కొత్త ఆరోగ్య పథకాన్ని తీసుకొస్తున్నామని, జిల్లా స్థాయిలోనే 80% వైద్య అవసరాలు తీర్చే లక్ష్యంతో సెకండరీ హెల్త్‌కేర్ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. టిమ్స్ హాస్పిటల్స్, వరంగల్ హెల్త్ సిటీ, కొత్త ఉస్మానియా హాస్పిటల్ నిర్మాణం చేపడుతున్నామని, నిమ్స్‌లో 2000 పడకల కొత్త భవనం నిర్మాణం జరుగుతోందని తెలిపారు. ఆరోగ్య శాఖలో రెండేళ్లలో 10 వేల పోస్టులు భర్తీ చేశామని, ఇంకా 7 వేల పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. క్యాన్సర్, ఇతర వ్యాధులపై పోరాటం కేవలం ప్రభుత్వ బాధ్యత కాదు.. ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం అన్నారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో అందరం కలిసికట్టుగా ముందుకు సాగుదాం అని మంత్రి దామోదర పిలుపునిచ్చారు. కాగా, విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు, నర్సులు, ఇతర వైద్య సిబ్బందికి మంత్రి అవార్డులు అందజేశారు.

**అందుబాటులోకి కచ్చితమైన రేడియేషన్ చికిత్స**

నిమ్స్‌లో అత్యాధునిక లినాక్(లినియర్ యాక్సలరేటర్) సేవలను ప్రారంభించడంతో కేన్సర్ రోగులకు ఖచ్చితమైన రేడియేషన్ చికిత్స అందుబాటులోకి వచ్చిందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. రూ.33 కోట్లతో నిమ్స్ కేన్సర్ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన ఈ సేవలను ఆయన మంగళవారం ప్రారంభించారు. సేవల ప్రారంభంతో తెలంగాణలో క్యాన్సర్ చికిత్స మరింత బలోపేతం అవుతుందన్నారు. అనంతరం మహిళల కేన్సర్ స్క్రీనింగ్ క్యాంపును మంత్రి ప్రారంభించారు. ఈ ఆధునిక సాంకేతికతతో ట్యూమర్‌పై మాత్రమే ప్రభావం చూపించి, ఆరోగ్య కణజాలాన్ని కాపాడే చికిత్స అందించగలుగుతామన్నారు. ట్రూ బీమ్ సిస్టమ్‌తో తక్కువ సమయంలోనే మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం కల్పించామని, కేన్సర్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఆధునిక వైద్య సదుపాయాలను మరింత విస్తరిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో యేటా 55 వేల నుంచి 60 వేల కొత్త కేసులు నమోదవుతుండడం ఆందోళన కలిగించే విషయమన్నారు. కేన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని ప్రజల్లో అవగాహన పెంచుతున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాలకు కూడా కేన్సర్ చికిత్స అందుబాటులోకి తీసుకొచ్చే దిశగా చర్యలు చేపట్టామని, అన్ని జిల్లా కేంద్రాల్లో డే కేర్ క్యాన్సర్ కేంద్రాలను ఏర్పాటు చేసి సేవలను విస్తరిస్తున్నామని, ములుగు, ఆదిలాబాద్ వంటి మారుమూల ప్రాంతాల్లో కూడా కీమోథెరపీ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చామని వివరించారు. 46 లక్షల మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం ద్వారా ముందస్తు వ్యాధి నిర్ధారణకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఈరోజు నుంచి నిమ్స్‌లో మహిళల కేన్సర్ స్క్రీనింగ్ క్యాంపును ప్రారంభించామని, మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని హెచ్‌పీవీ టీకా కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నామని చెప్పారు. 14 నుంచి 15 ఏళ్ల బాలికలకు ఉచితంగా టీకా అందిస్తూ గర్భాశయ కేన్సర్ నివారణకు కృషి చేస్తున్నామన్నారు. ఈరోజు కేన్సర్‌ను నోటిఫైబుల్ వ్యాధిగా ప్రకటిస్తున్నామని, తద్వారా ప్రతి కేన్సర్ కేసును నమోదు చేసే విధానం తీసుకొస్తున్నామని, కేన్సర్ రిజిస్ట్రీ ద్వారా ఖచ్చితమైన డేటాతో మెరుగైన ప్రణాళికలు రూపొందించగలుగుతామని చెప్పారు. కేన్సర్‌పై పోరాటం కేవలం ప్రభుత్వ బాధ్యత కాదు, ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని మంత్రి దామోదర్ అన్నారు. కార్యక్రమంలో రవాణా శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తు తదితరులు పాల్గొన్నారు.



# యూరియాను శాస్త్రీయంగా వాడాలి

హైదరాబాద్, వెలుతురు, ఏప్రిల్ 7:

దేశంలో అధికంగా యూరియా వాడుతున్న రాష్ట్రాలలో తెలంగాణ కూడా ఉందని, ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా ఈ రోజు ఆయన సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో ముఖాముఖి మాట్లాడారు. యూరియాను అధికంగా వాడటం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతినడంతోపాటు రానురాను దిగుబడులు కూడా తగ్గుతాయని, చీడపీడల సమస్యలు పెరుగుతాయని తెలిపారు. అందువల్ల యూరియాను శాస్త్రీయంగా వాడాలని సూచించారు. యూరియా యాప్, యూరియా వినియోగం వంటి అంశాలపై రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. 'రైతు నేస్తం'లో రైతులు అధికంగా పాల్గొనేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతుల సందేహాలను నివృత్తి చేయడంతోపాటు, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని తెలిపారు. యూరియా యాప్‌పై రైతుల అభిప్రాయాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. యూరియా యాప్‌తో లైన్లలో నిలబడే బాధ తప్పిందని, ఇంట్లో నుంచే యూరియాను బుక్ చేసుకుని తగిన సమయంలో తెచ్చుకునేందుకు వీలు కలిగిందని, దీంతో సమయం వృథా కావడంలేదని రైతులు యూరియా యాప్‌ని కొనియాడారు. భవిష్యత్తులో కూడా యూరియా యాప్‌తోనే యూరియా అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని రైతుల అభిప్రాయాల మేరకే ఈ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు. ఇప్పుడు పంట కోతల సమయం వచ్చిందని, రైతులు కోతల అనంతరం వచ్చే పంట వ్యర్థాలను కాల్చవద్దని సూచించారు. పంట వ్యర్థాలను కాల్చడం ద్వారా పర్యావరణం దెబ్బతింటుందని తెలిపారు. రైతులు తాము పండించే అన్ని పంటలలో పామాయిల్ పంటను కూడా వేయవచ్చని వివరించారు. రైతులందరు పామాయిల్ పంటను వేసినట్లయితే స్థిరమైన అధిక ఆదాయం పొందే వీలుంటుందన్నారు.

***మంత్రిని కలిసిన హుజురాబాద్ మున్సిపల్ పాలకవర్గం**

సచివాలయంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మలను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా హుజురాబాద్ ప్రతిపాదించిన డంపింగ్ యార్డు పనులను నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీహుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఒడితల ప్రణవ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆడిట్ శాఖ దేశంలోనే నెంబర్ వన్



హైదరాబాద్, ఏప్రిల్ 7:

ఆన్‌లైన్ ఆడిటింగ్‌లో అత్యుత్తమ ప్రమాణాలతో తెలంగాణ ఆడిట్ శాఖ దేశంలో నెంబర్ వన్‌గా నిలిచిందని, వరుసగా మూడుసార్లు దేశంలో నెంబర్ వన్ ర్యాంకు సాధించిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్రంలో ఆన్‌లైన్ ఆడిటింగ్ వ్యవస్థను పరిశీలించేందుకు వచ్చిన గుజరాత్ ఆడిట్ శాఖ ఉన్నతాధికారులతో ఆయన మంగళవారం సమావేశమయ్యారు. గుజరాత్ నుంచి ప్రత్యేకంగా వచ్చిన ఉన్నతాధికారులందరికీ సాదరంగా స్వాగతం పలుకుతున్నానన్నారు. తమ రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు అత్యంత బలంగా ఉన్నాయని అధికారులకు వివరించారు. రాష్ట్రంలో ఆడిట్ శాఖ పనితీరు అధ్యయనానికి అవసరమైన పూర్తి సహాయసహకారాలను అందిస్తామని, రాష్ట్రంలో జరుగుతున్న విషయాలను అర్థం చేసుకోవడానికి తమ అధికారులు పూర్తిగా సహకరిస్తారని గుజరాత్ అధికారులతో డిప్యూటీ సీఎం తెలిపారు. రెండు రోజులుగా రాష్ట్రంలోని పలు గ్రామ పంచాయతీలను సందర్శించి ఆన్‌లైన్ వ్యవస్థను అధ్యయనం చేస్తున్నామని, రాష్ట్రంలో ఆడిటింగ్ వ్యవస్థ పారదర్శకంగా, సమర్థవంతంగా కొనసాగుతున్నదని గుజరాత్ అధికారులు డిప్యూటీ సీఎంకు వివరించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, తెలంగాణ ఆడిట్ శాఖ డైరెక్టర్ నరసింహన్ తదితరులు పాల్గొన్నారు.

# రెండు వారాల్లో పరిష్కరిస్తాం

న్యూఢిల్లీ వెలుతురు ఏప్రిల్ 07:

దేశవ్యాప్తంగా పోలీస్ స్టేషన్లలో సీసీటీవీల ఏర్పాటు, నిర్వహణకు సంబంధించిన సమస్యలను రెండు వారాల్లో పరిష్కరిస్తామని కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టుకు హామీ ఇచ్చింది. ఈ అంశంపై సమగ్ర సమీక్ష కొనసాగుతోందని కేంద్రం తరఫున హాజరైన అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి ధర్మాసనానికి తెలిపారు. సీసీటీవీల పనితీరుపై ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి అమికస్ క్యూరీ, కేంద్ర హోం కార్యదర్శితో వరుస సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం పలు చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. దేశవ్యాప్తంగా పోలీస్ స్టేషన్లలో పనిచేయని సీసీటీవీల అంశంపై దాఖలైన పలు పిటిషన్లతో పాటు సుమోటోగా స్వీకరించిన కేసుపై సుప్రీం కోర్టు విచారణ చేపట్టింది. కోర్టు ఆదేశాల మేరకు కేంద్ర హోం కార్యదర్శి కూడా విచారణకు హాజరయ్యారు. విచారణ అనంతరం ఈ కేసును సుప్రీం కోర్టు ఏప్రిల్ 28కు వాయిదా వేసింది.



తదుపరి విచారణకు ముందు అమికస్ క్యూరీ తాజా స్థితిగతుల నివేదిక సమర్పించాలని, అవసరమైతే కేంద్ర ప్రభుత్వం కూడా అఫిడవిట్ దాఖలు చేయవచ్చని ధర్మాసనం సూచించింది. ప్రత్యేక పరిస్థితులు లేకపోతే భవిష్యత్తులో హోం కార్యదర్శి వ్యక్తిగతంగా హాజరుకావాల్సిన అవసరం లేదని ధర్మాసనం పేర్కొంది.

# మహబూబ్ నగర్ జిల్లాను సస్యశ్యామలం చేయడమే కాంగ్రెస్ సంకల్పం

**మహబూబ్ నగర్ వెలుతురు ఏప్రిల్ 07:**

మహబూబ్ నగర్ జిల్లాను సస్యశ్యామలం చేయడమే కాంగ్రెస్ సంకల్పమని టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం రోజునమహబూబ్ నగర్ లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'సంఘటన్ శ్రీజన్ అభియాన్' కార్యక్రమం భాగంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కార్యవర్గ ప్రమాణ స్వీకారం సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తో పాటుజిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ డీసీసీ కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్, సీడబ్ల్యూసీ సభ్యులు చల్లా వంశీ చందర్ రెడ్డి , టిపిసిసి జనరల్ సెక్రటరీలు,తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ మాట్లాడారు . పాలమూరురంగారెడ్డి ప్రాజెక్ట్ పూర్తి అయితే లక్షల ఎకరాలకు సాగునీరు అందించి రైతుల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావడం లక్ష్యం అని ఆయన అన్నారు. బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు అన్యాయం చేస్తోంద. ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇవ్వకుండా నిర్లక్ష్యం చూపుతోందన్నారు.కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు కు జాతీయ హోదా ఇస్తామన్నారు.పదేళ్ల బిఆర్ ఎస్ ఆర్థిక విధ్వంసాన్ని ఎత్తి చూపి తీరాల్సిందేన్నారు.

విజన్ లేకుండా బిఆర్ఎస్ పాలన కొనసాగిందన్నారు.సుదీర్ఘ చరిత్ర కలిగిన పార్టీ కాంగ్రెస్, మహత్యాగాలు చేసిన కుటుంబం గాంధీ కుటుంబం అని చెప్పారు. మోదీ 12 ఏళ్ల కాలంలో అధికారం పరమావధిగా కుల మతాల మధ్య చిచ్చు పెడుతూ విచ్చిన్నం చేసే కుట్రలు చేసిందన్నారు.

**బీజేపీ హయంలో పెట్రోల్,డీజిల్ రెట్లు తగ్గాయా?**

2 కోట్ల ఉద్యోగాలు వచ్చాయా?శ్రీరాముడి పేరు చెప్పి ఓట్లు అడగడం బీజేపీ నేతల నైజం అని ఘాటుగా విమర్శించారు.పిల్లల భవిష్యత్ కోసం కాంగ్రెస్ పార్టీ కావాలన్నారు.రాజకీయం చైతన్యం కలిగిన జిల్లా మహబూబ్ నగర్ అని ,ప్రతి ఒక్క కార్యకర్త కాంగ్రెస్ ప్రభుత్వ. అభివృద్ధి, సంక్షేమన్ని ప్రజలకు వివరించే ప్రయత్నం చేయాలన్నారు.కేటీఆర్ ,హరీష్ రావు నిత్యం అసత్యాలు, అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారనీ మండిపడ్డారు. కష్టపడితే ఫలితం వస్తుంది అన డానికి నేను పిసిసి కావడం ఓ ఉదాహరనఅని కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి లక్ష 20 వేల కోట్లు గోదావరిలో పోశారనీ ఘాటుగావిమర్శించారు. కాంట్రాక్టుల జేబులు నింపడం కోసం ప్రాజెక్టులు కట్టారని పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఈ సందర్భంగా ఘాటుగా విమర్శలు చేశారు.

# కల్లియాస్సేరి నియోజకవర్గంలో భారీ రోడ్ షో

కేరళం వెలుతురు ఏప్రిల్ 07:

కల్లియాస్సేరి నియోజకవర్గంలో సోమవారం రోజున భారీ మరియు ఉత్సాహభరితమైన రోడ్ షో నిర్వహించబడింది. ఈ రోడ్ షోలో ప్రజల నుంచి లభించిన అపార స్పందన యునైటెడ్ డెమోక్రాటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్)కు పెరుగుతున్న మద్దతును స్పష్టంగా తెలియజేస్తోంది.ఈ కార్యక్రమంలో ఏఐసీసీ పరిశీలకులు హర్కర వేణుగోపాల్ రావు, కాసరగోడ్ లోక్‌సభ సభ్యులు రాజ్ మోహన్ ఉన్నితాన్, కల్లియాస్సేరి అసెంబ్లీ యూడీఎఫ్ అభ్యర్థి రాజీవన్ కప్పచేరి పాల్గొన్నారు.ఈ సందర్భంగా హర్కర వేణుగోపాల్ రావు మాట్లాడుతూ, ప్రజల నుంచి లభిస్తున్న విశేష స్పందన యూడీఎఫ్ విజయానికి సంకేతమని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏకమై కృషి చేస్తుండటం వల్ల ఈ నియోజకవర్గంలో ఘన విజయం సాధిస్తామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# సమాచార సమగ్రత పరిరక్షకులు ఐఐఎస్ అధికారులు

- **బలాన్ని కాకుండా మేధస్సుతో చేసే సమాచార యుద్ధంలో అగ్రభాగాన నిలవండి**
- **కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అట్టడుగువారికి చేరేలా సమాచార వ్యాప్తి చేయండి**
- **ఐఐఎస్ ట్రైనీ అధికారులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ సూచన**
- **2009, 2023, 2024 ఐఐఎస్ ట్రైనీ అధికారులతో కేంద్ర మంత్రి భేటీ**

న్యూఢిల్లీ వెలుతురు ఏప్రిల్ 07:



దేశ భద్రత, సంక్షోభ సమాయాల్లో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తూ గందరగోళం సృష్టించే శక్తులను కుట్రలను తిప్పికొట్టేందుకు సమయోచిత, వాస్తవిక, బాధ్యతాయుతమైన సమాచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ (ఐఐఎస్) అధికారుల పాత్ర చాలా కీలకమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అభిప్రాయపడ్డారు. ఐఐఎస్ అధికారులు సమాచార మాధ్యమకారులుగా మాత్రమే కాదని, సమాచార సమగ్రతకు (ఇన్ఫర్మేషన్ ఇంటెగ్రిటీ), జాతీయ ఐక్యత పరిరక్షకులుగా నిలవాలని సూచించారు. యుద్ధం చేయకుండా సమాచార వ్యాప్తి ద్వారా శత్రువులను మనసులను ప్రభావితం చేయడంలో టీవీ, రేడియో సహా మీడియా సైకలాజికల్ ఆపరేషన్స్ నిర్వహిస్తూ ముఖ్యపాత్ర పోషిస్తాయన్నారు. బలాన్ని కాకుండా మేధస్సును ఉపయోగించి చేసే సమాచార యుద్ధంలో ఐఐఎస్ అధికారులు అగ్రభాగాన నిలవాలని కోరారు. ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ (ఐఐఎస్) 2009, 2023, 2024 బ్యాచ్ లకు చెందిన గ్రూప్ ఏ ట్రైనీ అధికారులు ఈనెల 15 నుండి 22 వరకు అంతర్గత భద్రత, సంక్షోభ, విపత్తు కమ్యూనికేషన్, సైకాలజికల్ ఆపరేషన్స్ పై అవగాహన పెంపొందించుకునేందుకు ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకోనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం రోజున సాయంత్రం న్యూఢిల్లీలోని కర్తవ్య భవన్ లో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ను ఆయా ట్రైనీ అధికారులు మర్యాదపూర్వంగా కలిశారు.

ఈ సందర్భంగా ఆయా అధికారుల విద్య, కుటుంబ నేపథ్య వివరాలను అడిగి తెలుసుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ లోకి రావడానికి కారణాలపైనా ఆరా తీశారు. దీంతోపాటు కేంద్ర ప్రభుత్వ పనితీరుపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో క్షేత్రస్థాయిలోకి వెళుతున్నాయా? లేదా? అట్టడుగునున్న అణగారిని వ్యక్తుల వరకు సంపూర్ణంగా సంక్షేమ ఫలాలు అందాలంటే ఏం చేస్తే బాగుంటుందనే అంశాల పైనా ఆరా తీశారు. ముఖ్యంగా నేటి పరిస్థితుల్లో సేవలు ఎలా మారుతున్నాయి? భవిష్యత్తులో ఎలా ఉండబోతుందనే అంశాలతోపాటు మారుమూల గ్రామాలకు సైతం సమాచారం చేరేలా కమ్యూనికేషన్ బలపడేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపైనా వారితో చర్చించారు.

అనంతరం వారిని ఉద్దేశించి బండి సంజయ్ మాట్లాడుతూ... వేగంగా మారుతున్న సమాచార ప్రపంచంలో సమర్ధవంతమైన కమ్యూనికేషన్ కేవలం పరిపాలనా సాధనం మాత్రమే కాదని, జాతీయ స్థిరత్వానికి, ప్రజల విశ్వాసానికి మూల స్థంభమని చెప్పారు. ఈ విషయంలో ఐఐఎస్ అధికారుల పాత్ర కీలకమని తెలిపారు. ముఖ్యంగా అంతర్గత భద్రతకు సంబంధించిన విషయానికొస్తే... మీడియా, సోషల్ మీడియాలో ప్రజలను తప్పుదారి పట్టించే ఫేక్ సమాచారం సవాల్ విసురుతున్న నేటి తరుణంలో వాటిని అధిగమిస్తూ ప్రజలను చైతన్యం చేసేందుకు ఏం చేయాలనే దానిపై ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్స్, సెంట్రల్ ట్రైనింగ్ ఇన్ స్టిట్యూట్ అందించే ప్రత్యేక శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య మధ్యవర్తిగా పనిచేసేలా సిద్ధం కావాలని సూచించారు. ''దేశం మీమీద ఆశలు పెట్టుకుంది. మీరు కేవలం సమాచార మాధ్యమకారులుగా మాత్రమే కాదు. సమాచార సమగ్రతకు(ఇన్ఫర్మేషన్ ఇంటెగ్రిటీ), జాతీయ ఐక్యత పరిరక్షకులుగా నిలవాలి''అని సూచించారు. ''యుద్ధం చేయకుండా సమాచార వ్యాప్తి ద్వారా శత్రువులను మనసులను ప్రభావితం చేయడంలో టీవీ, రేడియో సహా మీడియా ముఖ్యపాత్ర పోషిస్తాయి. ఈ విషయంలో బలాన్ని కాకుండా మేధస్సును ఉపయోగించి చేసే సమాచార యుద్ధంలో అగ్రభాగా నిలవాలి''అని కోరారు. ముఖ్యంగా దేశ భద్రత, సంక్షోభ సమాయాల్లో తప్పుడు సమాచారాన్ని పంపుతూ గందరగోళం సృష్టించే శక్తులను కుట్రలను తిప్పికొట్టేందుకు సమయోచిత, వాస్తవిక, బాధ్యతాయుతమైన సమాచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఐఐఎస్ అధికారుల పాత్ర చాలా కీలకమని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి వ్యక్తిగత కార్యదర్శి అండ్ర వంశీ, కేంద్ర హోంశాఖ మీడియా విభాగం అదనపు డైరెక్టర్ జనరల్ రాజ్ కుమార్, ఐఐఎస్ విభాగం కోర్సు డైరెక్టర్ రష్మీ రోజా తుషార నాయర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆయువు: కేవలం శ్వాస కాదు, సార్థకమైన ప్రయాణం!

జీవితమంటే ఒక దీపం. వెలిగినంత కాలం చుట్టూ ఉన్న ప్రపంచానికి వెలుతురునిస్తుంది, ఆరిపోయిన తర్వాత కేవలం నిశ్శబ్దమైన చీకటి మాత్రమే మిగులుతుంది. ఈ దీపం ఎంత కాలం వెలగాలో, ఏ క్షణాన గాలివాటము తగిలి ఆరిపోతుందో మనకు తెలియదు అసలు అదే జీవితపు అత్యంత మధురమైన, భయంకరమైన రహస్యం. కానీ ఇక్కడ అసలు ప్రశ్న ఏమిటంటే ఆ వెలుగుతున్న సమయంలో మనమేం చేస్తున్నాం? ఆ వెలుతురులో పదిమందికి దారి చూపిస్తున్నామా లేక మన నీడను చూసుకుని మనమే మురిసిపోతున్నామా? ఈ ప్రశ్నకు మనసు సాక్షిగా నిజాయితీగా సమాధానం చెప్పుకోగలిగితే, మన జీవన విధానం మారకుండా ఉండదు.



మహాకవి శ్రీశ్రీ ఒకప్పుడు గర్జించారు ప్రతి నిమిషం ఒక జీవితం, ప్రతి క్షణం ఒక అవకాశం. ఆ మాటలు ఈ ఆధునిక కాలంలో మరింత బలంగా ధ్వనిస్తాయి. సగటున ఒక మనిషి జీవిత కాలం డెబ్బై ఎనభై సంవత్సరాలు అనుకుందాం. కానీ ఆ లెక్కల్లోంచి నిద్ర, నిత్యకృత్యాలు, అనారోగ్యం, వృద్ధాప్యపు అలసట తీసివేస్తే మనం నిజంగా జీవించగల సమయం ఎంతో తెలుసా? ఆ మిగిలిన కాలాన్ని లెక్కేసుకుంటే ఎవరికైనా వెన్నులో వణుకు పుట్టక మానదు. మనకున్నది చాలా తక్కువ సమయం, కానీ మనం దాన్ని అక్షరాలా అలక్ష్యంగా గాలికి వదిలేస్తున్నాం.నేటి సమాజంలో నేను చాలా బిజీ అని చెప్పడం ఒక ఫ్యాషన్ అయిపోయింది. ఒక హోదాగా మారిపోయింది. ఉదయం కళ్ళు తెరవగానే చేతిలోకి మొబైల్ రావడం, రాత్రి కళ్ళు మూసే వరకు సోషల్ మీడియా మాయాలోకంలో విహరించడంఇదేనా జీవితం? గంటల తరబడి అర్థం లేని రీల్స్ చూస్తూ, కేవలం జీవనోపాధి కోసం యాంత్రికంగా పని చేస్తూ గడిపితే అది బిజీ కానే కాదు అది జీవితాన్ని నెమ్మదిగా కాల్చుకు తినడం. నిజమైన బిజీగా ఉండడం అంటే మన కలల వెనుక పరుగు తీయడం, కళ్లెదురుగా ఉన్న కన్నవారికి, కుటుంబానికి నాణ్యమైన సమయాన్ని ఇవ్వడం, సమాజానికి ఏదైనా చిన్న ఉపకారం చేయడం.

కాలమే దైవం అది ఎవరికోసమూ ఆగదు, కానీ మనం అది పోతుందని తెలిసీ పట్టించుకోం. యోగి వేమన పద్యాలలో ఒక నిగూఢ సత్యం ఉంటుంది చెప్పులకు చెప్పులు చేరి నిద్దురపోతాయి, తెలివైన వారు మాత్రం నిద్రను జయిస్తారు.మన పూర్వీకులు కాలాన్ని కేవలం సెకన్ల ముల్లులా చూడలేదు, దాన్ని ఒక అమూల్యమైన సంపదగా భావించారు. వారు పొలం పనులు చేస్తూ, జానపద గేయాలు పాడుతూ, సాయంత్రం వేళ అరుగు మీద కూర్చుని పిల్లలకు నీతి కథలు చెబుతూ, అద్భుతమైన ఆలయాలను నిర్మిస్తూ జీవితాన్ని ప్రతి అంగుళం అనుభవించారు. కానీ నేటి తరం పరిస్థితి ఏమిటి? అన్నీ ఉన్నాయి, కానీ దేన్నీ మనసారా అనుభవించే తీరిక లేదు. సమయం పుష్కలంగా ఉంది, కానీ దాన్ని ప్రేమించే మనసు లేదు.ఒక్క క్షణం కళ్ళు మూసుకుని ఆలోచించండి గత ఏడాది మీరు సాధించిన గొప్ప విషయం ఏమిటి? ఎప్పటి నుంచో నేర్చుకోవాలని ఉండి, తర్వాత చూద్దాంలే అని వాయిదా వేసిన ఆ విద్య ఏది? ఏ పుస్తకం మొదటి పేజీ చదివి పక్కన పెట్టేశారు? ఏ పర్యాటక ప్రాంతానికి వెళ్లాలని కలలు కని ఆగిపోయారు? ఆ జవాబులే మీ జీవిత పటంలో మీరు వదిలేసిన ఖాళీలు.

మన తెలుగు సంస్కృతిలో ఆయువు అనే పదానికి చాలా గంభీరమైన అర్థం ఉంది. ఆయువు అంటే కేవలం ఊపిరి పీల్చుకోవడం కాదు అది జాగ్రత్తగా, సార్థకంగా జీవించడం. మనం తిరుమల వేంకటేశ్వరుని ముందు నిలుచున్నప్పుడు ఆయురారోగ్య ఐశ్వర్యాలు ప్రసాదించు అని వేడుకుంటాం. కానీ ఆ దేవుడు ఇచ్చిన ఆ ఆయువును ఎలా సద్వినియోగం చేసుకోవాలో తెలుసుకునే విచక్షణను అడగడం మాత్రం మర్చిపోతాం.నేటి యువతరానికి అత్యంత ప్రమాదకరమైన శత్రువు వాయిదా. రేపు మొదలుపెడతాను. వచ్చే సోమవారం నుంచి కచ్చితంగా చేస్తాను . కొత్త సంవత్సరం నుంచి నా జీవితం మారిపోతుంది . ఇవన్నీ మనల్ని మనం మోసం చేసుకునే తీపి మాటలు. చదువులోనైనా, వ్యాపారంలోనైనా, చివరికి ప్రేమను వ్యక్తపరచడంలోనైనా ఈ వాయిదా అనే వ్యాధి మనల్ని ప్రాణం ఉన్న శవాలుగా మారుస్తుంది. జీవితం ఎవరి కోసమూ ప్లాట్‌ఫారమ్ మీద వేచి ఉండే రైలు కాదు. అది ప్రవహించే నది, ఒక్కసారి దాటిపోయిన నీటి బిందువు మళ్ళీ తిరిగి రాదు. మనం సమయాన్ని వృథా చేయడానికి ప్రధానంగా మూడు కారణాలు ఉంటాయి. భయం నేను ఈ పని చేస్తే ఫెయిల్ అవుతానేమో అనే భయం మనల్ని అడుగు ముందుకు వేయనివ్వదు.సోమరితనంఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడైనా చేయొచ్చులే అనే నిమ్మకు నీరెత్తిన చందనం.అహంకారం ,నాకు ఇంకా చాలా వయసు ఉంది, ఇప్పుడే ఏం తొందర? అనే అతివిశ్వాసం.ఈ మూడు శత్రువులూ కలిసి మన జీవిత లక్ష్యాన్ని చీకట్లోకి నెట్టేస్తాయి. వీటిని జయించడానికి ఏ హిమాలయాలకు వెళ్లనక్కర్లేదు, ఏ మహర్షి పాదాలు పట్టక్కర్లేదు. ప్రతిరోజూ రాత్రి పడుకునే ముందు మనతో మనం నిజాయితీగా మాట్లాడుకుంటే చాలు.తెలుగులో ఒక చక్కని నానుడి ఉంది ఉన్న ఊళ్ళో కూర్చుంటే ఉన్నది పోతుంది. అంటే సాహసించి బయట ప్రపంచంలోకి అడుగుపెట్టిన వాడికే జీవితం తన రహస్యాలను వెల్లడిస్తుంది. అడవిలో ఒక పువ్వు పూసినప్పుడు, దాని విత్తనాలు గాలికి వేర్వేరు దిశల్లో చెల్లాచెదురుగా పడితేనే కొత్త చెట్లు మొలుస్తాయి. మనం కూడా మన 'Comfort Zone' అనే గీతను దాటి బయటకు రాకపోతే, మన జీవితంలో కొత్త ఆలోచనలు, కొత్త విజయాలు మొలకెత్తవు.

ఒక వృద్ధుడు తన మనవడిని దగ్గరకు తీసుకుని ఇలా అన్నాడట నాయనా, నేను నీ వయసులో ఉన్నప్పుడు అనుకున్నాను.ఇంకా నా ముందు సముద్రమంత సమయం ఉందని. కానీ నా వయసు పెరిగేకొద్దీ తెలిసింది, ఆ సముద్రం కాస్తా ఆవిరైపోయిందని.ఈ మాటలలో ఒక తరం కోల్పోయిన అవకాశాల నిరాశ కనిపిస్తుంది. ఆ చేదు అనుభవం మనకు ఎదురుకాకూడదంటే ఉన్న ఒకే ఒక మార్గం ఇప్పుడే మొదలుపెట్టడం . జీవితాన్ని సార్థకం చేసుకోవడమంటే ఎప్పుడూ హిమాలయాలంత ఎత్తులో ఉండే పనులు చేయక్కర్లేదు.ఆకలితో ఉన్న ఒక అనాథకు పట్టెడన్నం పెట్టడం.ఒంటరిగా ఉన్న వృద్ధులను ప్రేమతో పలకరించడం.బాధలో ఉన్న స్నేహితుడి మాటను ఓపికగా వినడం.పర్యావరణం కోసం ఒక మొక్క నాటడం.ఇవన్నీ జీవితాన్ని పరిపూర్ణం చేసే అంశాలే. గొప్ప విజయాలు ఎప్పుడూ ఒకేసారి ఆకాశం నుండి ఊడిపడవు.అవి మన రోజువారీ జీవితంలోని చిన్న చిన్న సార్థకమైన క్షణాల కలయిక.జీవితపు అందం దాని పొడవులో (ఎన్ని ఏళ్లు బతికామన్నది) లేదు దానిని మనం ఎంత లోతుగా, ఎంత అర్థవంతంగా జీవించాం అన్న దానిలోనే ఉంది.

చివరగా, మిత్రమా మీరు ఈ వ్యాసం చదువుతున్న ఈ నిమిషం మళ్ళీ రాదు. ఈ పేజీ మడతపెట్టిన తర్వాత ఒక్క క్షణం కళ్ళు మూసుకోండి. గుండె మీద చేయి వేసుకుని ఆలోచించండి.మీ జీవితంలో మీరు నిజంగా చేయాలనుకున్న పని ఏమిటి?ఎవరికి ధన్యవాదాలు చెప్పాలని ఉండి ఆగిపోయారు? ఏ పాటను గొంతు విప్పి పాడాలనుకుంటున్నారు?

ఆ జవాబులే మీ ఆత్మ తాలూకు నిజమైన స్వరూపం. ఆ దిశగా మీ ప్రయాణాన్ని ఇప్పుడే, ఈ క్షణమే మొదలుపెట్టండి. జీవితం చిన్నదే కావచ్చు, కానీ అది వృథా చేయడానికి కాదు, ఒక అద్భుతమైన కావ్యంగా తీర్చిదిద్దడానికి. ప్రతి రోజును ఒక కొత్త జన్మగా భావించండి. మీ జీవితం ఒక కాన్వాస్ అయితే, మీ ఆలోచనలే రంగులు. ఆ రంగులతో మీ జీవితాన్ని ఒక అద్భుతమైన కళాఖండంగా చిత్రించండి!



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

# దేవాలయాలు అందరివే అయితే... అర్చకత్వం ఎందుకు ఎస్సీ ఎస్టీ బీసీలకు కాదు?

భారతదేశం అనే సమాజం ఒక విరుద్ధాల సమాహారం. ఒకవైపు ప్రపంచానికి సమానత్వం, మానవత్వం, ధర్మం గురించి బోధించిన దేశం అని గర్వపడుతుంటే, మరోవైపు కులం పేరుతో మనుషులను విభజించుకుంటూ, అసమానతలను కొనసాగిస్తున్న దేశం కూడా మనదే. రాజ్యాంగం "సమానత్వం"ను హామీ ఇస్తున్నా, భూమి మీద వాస్తవం మాత్రం ఇంకా "కులాధారిత అసమానత"గానే ఉంది. ఈ విరుద్ధ పరిస్థితుల్లోనే కుల వ్యవస్థ, అర్చకత్వం, రిజర్వేషన్లు, సామాజిక న్యాయం వంటి అంశాలపై దేశవ్యాప్తంగా మళ్లీ చర్చ ముదురుతోంది.

ఈ చర్చలో కేంద్రంగా నిలిచింది పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ లేవనెత్తిన ప్రశ్నలు. ఆయన వ్యాఖ్యలు కేవలం ఒక వ్యక్తి అభిప్రాయం కాదు - దశాబ్దాలుగా అణగారిన వర్గాలు అనుభవిస్తున్న అన్యాయానికి ప్రతిధ్వని. ఈ వ్యాఖ్యలను సమర్థిస్తూ అనేక ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఎంబీసీ సంఘాలు ముందుకు రావడం, మరోవైపు కొన్ని బ్రాహ్మణ సంఘాలు తీవ్రంగా స్పందించడం - ఇవన్నీ కలిసి ఒక ముఖ్యమైన ప్రశ్నను దేశం ముందు ఉంచాయి: ఈ దేశం నిజంగా సమానత్వం వైపు నడుస్తుందా? లేక కుల ఆధిపత్యాన్ని కాపాడుకునే దిశగా వెళ్తుందా?

కుల వ్యవస్థ గురించి మాట్లాడేటప్పుడు చాలా మంది అది పురాతన సంప్రదాయం అని, వృత్తుల ఆధారంగా ఏర్పడిందని చెబుతారు. కానీ ఈ వాదనలో ఒక కీలకమైన అంశాన్ని మర్చిపోతారు - కాలక్రమేణా అది జన్మ ఆధారంగా మారి, ఒక వర్గాన్ని పై స్థాయిలో, మరొక వర్గాన్ని దిగువ స్థాయిలో నిలబెట్టే విధంగా కఠినంగా మారింది. ఈ వ్యవస్థలో జన్మించిన క్షణం నుంచే ఒక మనిషి అవకాశాలు, గౌరవం, జీవన విధానం నిర్ణయించబడడం ప్రారంభమవుతుంది. ఇదే అసమానతకు మూలం.

ఈ నేపథ్యంలో "కులం అన్నం పెట్టదు, కులంతో అభివృద్ధి రాదు" అనే సత్యాన్ని గుర్తు చేసుకోవాలి. రైతు పండించిన ధాన్యం అందరికీ అన్నం పెడుతుంది; ఆ రైతు కులం మనం అడుగుతామా? కూలీ పని చేసే వ్యక్తి చెమటతో నిర్మించిన ఇల్లు అందరూ వాడుతారు; అతని కులం మనం గుర్తుంచుకుంటామా? వాస్తవానికి మన జీవన విధానంలో కులం అనే భావనకు ఉపయోగం లేదు. కానీ సామాజికంగా మాత్రం అది ఒక గట్టి గోడలా నిలిచిపోయింది.

ఇక్కడే అర్చకత్వం అంశం మరింత స్పష్టంగా కనిపిస్తుంది. హిందూ దేవాలయాలు అన్నవి సమాజంలోని ప్రతి వ్యక్తి విశ్వాసానికి ప్రతీకలు. దేవుడు అందరికీ ఒకటే అయితే, ఆయనకు సేవ చేసే హక్కు ఎందుకు ఒకే కులానికి పరిమితం కావాలి? వేదాలు నేర్చుకుని, నియమ నిష్ఠలతో జీవించి, పూజా విధానాలను అవగాహన చేసుకున్న ఎవరైనా అర్చకత్వం చేయగలరనే వాదనకు బలమైన ఆధారాలున్నాయి. అయినప్పటికీ, బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఈ అవకాశం నిరాకరించడం వెనుక ఉన్న అసలు కారణం ఏమిటి అనే ప్రశ్న తప్పించుకోలేనిది.

సమాజంలో ఇతర వృత్తులన్నీ కుల పరిమితులను దాటి విస్తరించాయి. మాదిగల వృత్తిగా భావించిన చెప్పుల తయారీలో అన్ని కులాలవారు ఉన్నారు, అలాగే చాకలి, మంగలి, వడ్రంగి, విశ్వబ్రాహ్మణ, పద్మశాలిల వృత్తిగా ఉన్న బట్టల నేసే రంగంలో కూడా అన్ని కులాలవారు చేరారు, గాండ్ల(నూనె తీసే వృత్తి) కుమ్మరి, యాదవ (పాల వృత్తి) వడ్డెర్ల వృత్తిగా ఉన్న పనుల్లో కూడా వివిధ వర్గాలవారు ఉన్నారు. ఇలా ప్రతి వృత్తిలో పరస్పర కలయికను స్వాగతించిన సమాజం, అర్చకత్వం విషయంలో మాత్రం కులాన్ని అడ్డుగా పెట్టుకోవడం ఒక స్పష్టమైన ద్వంద్వ వైఖరి. "వృత్తికి కులం అవసరం లేదు" అనే సూత్రం అన్ని చోట్ల వర్తిస్తే, దేవాలయాల వద్ద ఎందుకు వర్తించకూడదు? ఇదే సమయంలో బ్రాహ్మణ సంఘాల వైఖరి పై తీవ్రమైన విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా కుల వ్యవస్థను కొనసాగిస్తూ, రిజర్వేషన్లను వ్యతిరేకించడం అనేది తార్కికంగా నిలబడలేని స్థితి. కుల వ్యవస్థ వల్లే అసమానతలు పుట్టుకొస్తే, వాటిని సరిచేయడానికి వచ్చిన రిజర్వేషన్లను వ్యతిరేకించడం ఎలా న్యాయం అవుతుంది? ఈ నేపథ్యంలో బ్రాహ్మణ సంఘాలు ఒక స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉంది - వారు కుల వ్యవస్థ రద్దుకు అనుకూలమా? లేక వ్యతిరేకమా? ఈ ప్రశ్నకు సమాధానం ఇవ్వకుండా, మంద కృష్ణ మాదిగ వంటి నాయకులపై విమర్శలు చేయడం నైతికంగా సరైనది కాదని అనేక సంఘాలు భావిస్తున్నాయి. ఎందుకంటే, ఆయన లేవనెత్తిన ప్రశ్నలు వ్యక్తిగత విమర్శలు కాదు, అవి వ్యవస్థపై ప్రశ్నలు. సమాజంలో సమానత్వం కోసం, అణగారిన వర్గాలకు గౌరవం కోసం, అవకాశాల కోసం అడిగిన ప్రశ్నలు.రిజర్వేషన్ల విషయానికి వస్తే, అది భారత రాజ్యాంగంలో ఒక కీలకమైన సామాజిక న్యాయ సాధనం. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రిజర్వేషన్లను శాశ్వత పరిష్కారంగా కాకుండా, అసమానతలను సరిచేసే ఒక తాత్కాలిక సాధనంగా ప్రతిపాదించారు. కానీ ఆయన ఒక ముఖ్యమైన విషయం స్పష్టం చేశారు, "సామాజిక అసమానతలు కొనసాగినంత కాలం రిజర్వేషన్లు కొనసాగాలి."ఇప్పటికీ కుల వివక్ష పూర్తిగా అంతరించిపోలేదు. గ్రామాల్లో, పట్టణాల్లో, విద్యా సంస్థల్లో, ఉద్యోగాల్లో - అనేక రూపాల్లో అది కనిపిస్తూనే ఉంది. ఈ పరిస్థితుల్లో రిజర్వేషన్లను రద్దు చేయాలని చెప్పడం వాస్తవాలను నిరాకరించడం అవుతుంది. అదే సమయంలో ఒక ప్రశ్న తలెత్తుతుంది - EWS కోటలో లభిస్తున్న రిజర్వేషన్లను వదులుకోవడానికి సిద్ధమా? అన్ని వర్గాలు రిజర్వేషన్ల ప్రయోజనాలు పొందుతున్నప్పుడు, కేవలం కొన్ని వర్గాలపై మాత్రమే విమర్శలు చేయడం సమానత్వ సూత్రానికి విరుద్ధం.

ఇటీవల జరిగిన కొన్ని వ్యాఖ్యలు, ముఖ్యంగా శ్రీకృష్ణుడి గురించి చేసిన వ్యాఖ్యలు కూడా ఈ చర్చను మరింత వేడెక్కించాయి. భక్తి, విశ్వాసం అనేవి వ్యక్తిగతమైనవి అయినప్పటికీ, అవి కోట్లాది ప్రజల భావోద్వేగాలతో ముడిపడి ఉంటాయి. అలాంటి విషయాల్లో బాధ్యతగా మాట్లాడాల్సిన అవసరం ఉంది. యాదవ సమాజం సహా అనేక వర్గాల భావాలను గౌరవించడం సమాజంలో శాంతి కోసం అవసరం. అదే సమయంలో, పురాణాల వ్యాఖ్యానాల ఆధారంగా వ్యక్తుల భావాలను అవమానించడం కూడా సమంజసం కాదు.

మంద కృష్ణ మాదిగ వ్యక్తిత్వాన్ని పరిశీలిస్తే, ఆయన మూడు దశాబ్దాలుగా అణగారిన వర్గాల కోసం పోరాటం చేస్తున్నారు. ఎటువంటి అధికార పదవి లేకుండా, ప్రజల మధ్య ఉండి, వారి సమస్యలను వెలుగులోకి తీసుకురావడం ద్వారా ఒక ప్రత్యేక స్థానం సంపాదించారు. అందుకే ఆయనకు "పద్మశ్రీ" పురస్కారం లభించడం ఒక వ్యక్తిగత గౌరవం మాత్రమే కాదు, ఒక సామాజిక ఉద్యమానికి గుర్తింపు.

ఈ నేపథ్యంలో బ్రాహ్మణ సమాజం సహా అన్ని వర్గాలు introspection చేసుకోవాల్సిన సమయం వచ్చింది. కుల ఆధారిత ఆధిపత్యాన్ని కొనసాగించాలా? లేక సమానత్వాన్ని స్వీకరించాలా? సమాజం ముందుకు సాగాలంటే, పాత ఆలోచనలను విడిచిపెట్టి, కొత్త దిశలో అడుగులు వేయాల్సిన అవసరం ఉంది.

సమానత్వం అనేది కేవలం నినాదం కాదు, అది ఆచరణలో ఉండాలి. దేవాలయాల్లో, విద్యలో, ఉద్యోగాల్లో, సామాజిక గౌరవంలో - ప్రతి చోటా సమాన అవకాశాలు కల్పించాల్సిందే. కులం ఆధారంగా కాదు, సామర్థ్యం ఆధారంగా అవకాశాలు ఇవ్వడం ద్వారానే నిజమైన అభివృద్ధి సాధ్యం. చివరగా, ఈ చర్చలో అసలు సారాంశం ఒకటే - కులరహిత సమాజం నిర్మాణం. ఇది ఒకరోజులో సాధ్యమయ్యే పని కాదు. కానీ అది అసాధ్యం కూడా కాదు. ప్రతి వర్గం తమలో మార్పు తెచ్చుకుంటే, పరస్పర గౌరవంతో ముందుకు సాగితే, ఈ లక్ష్యం సాధ్యమే.భారత దేశం నిజంగా మహాన దేశంగా నిలవాలంటే, కుల గోడలు కూలాలి. మానవత్వం గెలవాలి. సమానత్వం సాధించాలి. అదే నిజమైన ధర్మం, అదే నిజమైన న్యాయం.



మన్నారం నాగరాజు
తెలంగాణ లోక్‌సత్తా పార్టీ
మాజీ అధ్యక్షుడు.

# మన జీవితానికి ఆధారం - కుటుంబం

కుటుంబమే మన మొదటి పాఠశాల, తల్లిదండ్రులే మన మొదటి గురువులు" అనే మాట కేవలం ఒక సామెత మాత్రమే కాదు, మన జీవిత సత్యం. మనం ఎలా మాట్లాడాలి, ఎలా ప్రవర్తించాలి, మంచి చెడు ఏమిటో తెలుసుకునే స్థలం కుటుంబమే. కానీ నేటి ఆధునిక ప్రపంచంలో మనం చాలా విషయాల్లో ముందుకు వెళ్లినా, కుటుంబ విలువల విషయంలో మాత్రం కొంత వెనక్కి వెళ్లుతున్నాం అనే బాధాకరమైన నిజం మన ముందుంది. మొదటగా, తల్లిదండ్రుల parenting చాలా ముఖ్యమైన విషయం. తల్లిదండ్రులు పిల్లలకు కేవలం చదువు నేర్పించడం మాత్రమే కాదు, మంచి సంస్కారం, మానవత్వం, గౌరవం వంటి విలువలను కూడా నేర్పించాలి. పిల్లలకు చిన్నప్పటి నుంచే తల్లిదండ్రుల విలువ తెలియజేయాలి. తల్లిదండ్రులు చేసిన త్యాగాలను, వారి ప్రేమను అర్థం చేసుకునేలా పిల్లలను పెంచాలి. ఒక రోజు తల్లిదండ్రులు వృద్ధులవుతారు... వారి చేతులు బలహీనపడతాయి... కళ్ళు మందగిస్తాయి... అప్పుడు వారికి అవసరమయ్యేది డబ్బు కాదు, పిల్లల ప్రేమ మరియు పరామర్శ. తల్లి తండ్రి కష్టాన్ని అర్థం చేసుకోలేని పిల్లలు మానవత్వం లేని వారిగా మారే ప్రమాదం ఉంది. చిన్నప్పటి నుండి అల్లారుముద్దుగా పెంచితే, బాధ్యత తెలియని పిల్లలు తయారవుతారు. అందుకే కష్టంతోనే పెంచి, బాధ్యత తెలియజేసి, డబ్బు విలువ కూడా నేర్పించడం నేటి తరానికి చాలా అవసరం. ఇంకా ఒక ముఖ్యమైన విషయం భార్యాభర్తల సంబంధం. పెళ్లి అనేది కేవలం ఇద్దరి మనుషుల బంధం కాదు, రెండు కుటుంబాల బంధం. భార్యాభర్తల మధ్య ప్రేమ, నమ్మకం, పరస్పర గౌరవం ఉంటే ఆ కుటుంబం ఒక స్వర్గం లాంటిది అవుతుంది. కానీ నేటి సమాజంలో అక్రమ సంబంధాలు పెరుగుతున్నాయి. క్షణిక ఆనందం కోసం తీసుకున్న తప్పుడు నిర్ణయం వల్ల ఒక కుటుంబం మొత్తం కన్నీళ్లలో మునిగిపోతుంది. పిల్లల భవిష్యత్తు దెబ్బతింటుంది. హత్యలు, ఆత్మహత్యలు ఎన్నో రోజులు చూస్తూనే ఉన్నాము. కుటుంబం పరువు పోయి, పది మందిలో పలుచనై ఎందుకు ఇదంతా? మన కుటుంబం, మన విలువలు, మన సంప్రదాయం, కట్టుబాట్లు , ఇవన్నీ మన కోసమే. ఒకసారి తల్లి వల్లనో తండ్రి వల్లనో తప్పు జరిగితే, ఆ పిల్లల కన్నీళ్లు, తల్లిదండ్రుల బాధ , ఇవి ఏ డబ్బుతోనూ కొనలేం. ఈ విషయం ఒకసారి ఆలోచిస్తే, తప్పటడుగు వేసే వారు ఆ అడుగు వేయగలరా? మరొక బాధాకరమైన మార్పు ఏమిటంటే పక్క మనిషి బాధను పట్టించుకోకపోవడం. ఒకప్పుడు పక్కింట్లో ఎవరికైనా కష్టం వస్తే, అందరూ కలిసి సహాయం చేసేవారు. కానీ ఇప్పుడు చాలా మంది తమ పనుల్లో మాత్రమే బిజీగా ఉండి, ఇతరుల సమస్యలను పట్టించుకోవడం తగ్గిపోయింది. మనిషి మనిషికి దూరమవుతున్నాడు... హృదయాలు దగ్గరగా ఉండాల్సిన చోట గోడలు పెరుగుతున్నాయి. ఇంకా ఒక పెద్ద సమస్య, మనిషి మనసుతో ఆలోచించడం తగ్గిపోవడం. ఈరోజుల్లో చాలా మంది డబ్బు ఉంటే గౌరవం ఇస్తున్నారు, లేకపోతే అసలు మనిషిగా కూడా చూడటం లేదు. డబ్బు ఉంటేనే విలువ, లేకపోతే బతికే అర్హత లేనట్టుగా చూడటం ఒక ప్రమాదకరమైన ధోరణి. ఇది సమాజంలో అసమానతలు, బాధలు పెరగడానికి కారణం అవుతోంది. మనం గుర్తుంచుకోవాల్సిన ఒక గొప్ప సత్యం ఉంది , మనిషి ప్రాణం కంటే డబ్బు పెద్దది కాదు. డబ్బు మన జీవితంలో అవసరం, కానీ అది మనిషి ప్రాణం కన్నా గొప్పది కాదు. డబ్బు పోతే మళ్లీ సంపాదించవచ్చు, కానీ ఒక మనిషి ప్రాణం పోతే తిరిగి రాదు. మొత్తానికి, కుటుంబ విలువలు మన జీవితానికి పునాది లాంటివి. తల్లిదండ్రులను గౌరవించడం, భార్యాభర్తల మధ్య నమ్మకాన్ని కాపాడుకోవడం, ఇతరుల బాధను అర్థం చేసుకోవడం, డబ్బు కంటే మనిషి ప్రాణానికి విలువ ఇవ్వడం —— ఇవన్నీ కలిసి ఒక మంచి కుటుంబాన్ని, మంచి సమాజాన్ని నిర్మిస్తాయి. ముగింపు ఈ రోజుల్లో మనం డబ్బు కోసం పరుగులు తీస్తూ, సంబంధాలను మర్చిపోతున్నాం. కానీ ఒకసారి మన జీవితాన్ని వెనక్కి తిరిగి చూసుకుంటే కష్ట సుఖాల్లో మన వెంట నిలబడేది డబ్బు కాదు, మన కుటుంబమే అని అర్థమవుతుంది.మనకు ఆనందం వచ్చినప్పుడు చప్పట్లు కొట్టేది సమాజం కావచ్చు...

కానీ మనకు బాధ వచ్చినప్పుడు కన్నీళ్లు తుడిచేది మన కుటుంబం మాత్రమే.

అందుకే మనం ఎప్పటికీ గుర్తుంచుకోవాల్సిన ఒక గొప్ప సత్యం ,

కుటుంబం మన బలం...

కుటుంబం మన ఆశ్రయం...

కుటుంబం మన అసలు సంపద.

డబ్బు పోతే మళ్లీ సంపాదించవచ్చు,

కానీ కుటుంబాన్ని కోల్పోతే తిరిగి పొందడం చాలా కష్టం.

కాబట్టి మనం ఈ రోజు నుంచే ఒక సంకల్పం తీసుకుందాం

కుటుంబ విలువలను కాపాడుకుందాం...

సంబంధాలను ప్రేమతో నిలబెట్టుకుందాం...

మనసుతో జీవిద్దాం.

"కుటుంబం బలంగా ఉంటే మనిషి బలంగా ఉంటాడు...

మనిషి బలంగా ఉంటే సమాజం బలంగా ఉంటుంది."



జి. రజని రెడ్డి
నవల రచయిత.

# రైల్వే పెండింగ్ ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

- సిఎస్ కె. రామకృష్ణా రావు

హైదరాబాద్, వెలుతురు ఏప్రిల్ 7 :

రాష్ట్రంలో పురోగతిలో ఉన్న రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ అంశాలను పరిష్కరించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు అన్నారు. రాష్ట్రంలో పలు రైల్వే ప్రాజెక్టులకు సంబందించిన అపరిష్కృత అంశాలపై సి.ఎస్ నేడు సచివాలయంలో సంబంధిత ఉన్నతాధికారులతో సమీక్షించారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, జయేష్ రంజన్, నవీన్ మిట్టల్, టి.జి.ఆర్.టి.సి ఎండీ నాగిరెడ్డి, జీహెచ్ఎంసీ కమీషనర్ ఆర్.వి కర్ణన్, జలమండలి ఎం.డి అశోక్ రెడ్డి, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ వినయ్ కృష్ణా రెడ్డి, సైబరాబాద్ మున్సిపల్ కమీషనర్ సృజన, దక్షిణ మండలం విద్యుత్ సరఫరా సంస్థ ఎండి జితేష్ పాటిల్ , మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్ మను చౌదరి తదితర అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.



రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి రైల్వే అండర్ బ్రిడ్జిలు, అప్రోచ్ రోడ్ల నిర్మాణం, రోడ్ల విస్తరణ, చర్లపల్లి రైల్వే స్టేషన్ నుండి ప్రజా రవాణా మరింత మెరుగు పరచడం తదితర దాదాపు 21 అంశాలపై సమీక్షించారు. ఈ పెండింగ్ అంశాలకు సంబంధించి సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, ప్రధానంగా మున్సిపల్, జలమండలి, రెవిన్యూ, విద్యుత్, రోడ్లు భవనాల శాఖల అధికారులు సంయుక్త తనిఖీలను నిర్వహించి తగు పరిష్కార మార్గాలను చేపట్టాలని సి.ఎస్ ఆదేశించారు. ఈ రైల్వే ప్రాజెక్టుల పెండింగ్ అంశాలపై త్వరలోనే రైల్వే ఉన్నతాధికారులతో సమావేశముందని, ఈ లోపు ప్రతీ పెండింగ్ అంశానికి తగు నివేదికను సమర్పించాలని పేర్కొన్నారు.

## గ్రంధాలయాలు మనోవిజ్ఞాన పెంపుకు నిలయాలు



- బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ .

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) ఏప్రిల్ 07:

మంగళవారం కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బిఆర్ఎస్ నాయకులు కోల శ్రీకాంత్ ముదిరాజ్, బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిసి జిహెచ్ఎంసి లోని అన్ని డివిజన్ల లో గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే కి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మాట్లాడుతూ గ్రంథాలయాలు మనోవిజ్ఞాన పెంపుదలకు నిలయాలు అని, గ్రంథాలయాలలో ప్రతి ఒక్కరూ కొంత సమయాన్ని కేటాయించినట్లయితే విషయ పరిజ్ఞానంతో పాటు మానసిక స్థైర్యం పెంపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజ శేకర్, విక్రమ్ రెడ్డి, కేశవ్ యాదవ్, యోగేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 9వతేదీ విద్యుత్ సమస్యలపై బిజెపి ఆధ్వర్యంలో మంచాల విద్యుత్ కార్యాలయం ముట్టడి



- రైతులు బిజెపి నాయకులు కార్యకర్తలు హాజరుకావాలి
- బిజెపి పార్టీ మంచాల మండలం అధ్యక్షుడు నూకం రాజు ముదిరాజ్

మంచాల వెలుతురు ఏప్రిల్ 07:

మంచాల మండల అధ్యక్షుడు నుకం రాజు ముదిరాజ్ మాట్లాడుతూ మండలంలోనిచాలా గ్రామాల్లో లో ఓ ల్టేజీ విద్యుత్ సమస్యవల్లరైతులు చాలాఇబ్బందులు ఎదుర్కొంటున్నారు కావున రైతులకు విద్యుత్ సమ స్య లేకుండాచూడాలని మంచాల మండలం భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో మంచాలవిద్యుత్ సబ్ స్టేషన్ ముట్టడి ఉంటుంది అనిఅన్నారు కావున మంచాల మండలం లోని అన్ని గ్రామాల నుండి రైతులు బిజెపి జిల్లా నాయకులు మండల నాయకులు అన్ని గ్రామాల బూత్ అధ్యక్షులు కార్యకర్తలు అందరూ పా ల్గొని విద్యుత్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్నివిజయవంతం చేయాలని పిలుపునిచ్చారు కార్యక్ర మం లో బిజెపి జిల్లానాయకులు మారగోని శ్రీశైలం పాండాల జంగయ్యగౌడ్ మండలప్రధానకార్యదర్శి వెదిరే జగ దీశ్వర్ రెడ్డి తదితరులుపాల్గొన్నారు

## మృతుని కుటుంబానికి గ్రామస్తుల చేయూత



- *రూ.53,500 నగదు,50 కిలోల బియ్యం అందజేత

మోత్కూర్, ఏప్రిల్ 7,(వెలుతురు న్యూస్ ):

: మండలంలోని అనాజిపురం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో అకాల మృతి చెందిన ఓ నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం, బియ్యం అందజేసి గ్రామస్తులు తమ మానవత్వాన్ని చాటుకున్నారు. గ్రామానికి చెందిన నల్ల అంజయ్య మృతి చెందడంతో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. దీంతో గ్రామస్తులు, యువకులు స్వచ్ఛందంగా సేకరించిన రూ.53,500తో పాటు 50 కిలోల బియ్యాన్ని ఆ కుటుంబానికి మంగళవారం స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా తమకు ఆర్థిక సహాయం అందించిన గ్రామస్తులకు మృతుని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు తదితరులు ఉన్నారు.

## అంగన్వాడీ టీచర్ల సేవలు సులభతరం కొరకు చరవాణీల పంపిణీ.




మోత్కూర్, ఏప్రిల్ 7,(వెలుతురు న్యూస్ ):

మోత్కూర్ మున్సిపాలిటీ కేంద్రంలో ఐసిడిఎస్ ఆఫీసు నందు ఎమ్మెల్యే మందుల సామెల్ గారు అంగన్వాడి టీచర్లు సమాచార సేకరణ,క్రోడీకరణ సులభంగా చేయుటకు చరవాణీల పంపిణీ కార్యక్రమానికి హాజరై అంగన్వాడీ టీచర్లకు, సూపర్వైజర్లకు చరవాణిలను పంపిణీ చేశారు. అంగన్వాడీ సంబంధించిన డీటెయిల్స్ అన్ని ఫోన్లో చేయాలి. గర్భిణీ, బాలింతలకు,పిల్లలకు అందించే కార్యక్రమాలు అన్ని ఫోన్ లో చేయాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో డి.డబ్ల్యూ. నరసింహారావు, సి.డి.పి.ఓ యామిని, మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్న,కమీషనర్ సతీష్ కుమార్, ఎమ్మార్వో జ్యోతి,కౌన్సిలర్లు,సూపర్వైజర్లు జ్యోతి, మధురమ్మ,షమీం,వాణి, యాక్ పాషా, అంగన్వాడి టీచర్లు ఆయాలు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలి

- బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్.

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) ఏప్రిల్ 07



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లో మంగళవారం 129 సూరారం డివిజన్ సంజయ్ గాంధీ నగర్ లోని మారుతి మెడికల్ హాల్ వద్ద పుప్పాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో మల్లారెడ్డి హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిథిగా ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటు ద్వారా పేద ప్రజలకు సేవలను అందిస్తున్న పుప్పాల ఫౌండేషన్ డైరెక్టర్ మరియు డివిజన్ ప్రెసిడెంట్ పుప్పాల భాస్కర్, మల్లారెడ్డి ఇన్స్టిట్యూట్స్ యాజమాన్యానికి నా అభినందనలు, ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటుచేసిన ఏ ఉచిత వైద్య శిబిరాన్ని నిరుపేదలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న వారికి మందులను పంపిణీ చేశారు. అనంతరం బస్తీలోని హరి హర క్షేత్రం శివాలయం నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు.
ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, పోలే శ్రీకాంత్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సిద్దిక్, సీనియర్ నాయకులు మధుమోహన్, ఫెరోజ్, సాజిత్, ప్రశాంత్, బషీరుద్దీన్, ప్రభుదాస్, రవి, ముకుందం, ప్రభుదాస్, కోల శ్రీకాంత్, హేమలతా రెడ్డి, లావణ్య, ధనలక్ష్మి, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆర్టీసీ లక్ష్మీనారాయణ, భద్రప్ప, సంజీవరెడ్డి, వరప్రసాద్, అనిల్, రవితేజ, సుమన్, సత్యనారాయణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఉర్సే షరీఫ్ ముబారక్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న హన్మంతన్న

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) ఏప్రిల్ 07:



బాచుపల్లి గ్రామంలో ఉన్న హజ్రత్ సయ్యద్ రహ్మతుల్లా షా ఖాద్రి (జీతే పీర్) దర్గా ఉర్సే షరీఫ్ ముబారక్ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన దర్గా ప్రాంగణంలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని, సాంప్రదాయ కార్యక్రమాలను వీక్షించారు. అనంతరం మాట్లాడుతూ, ఉర్సే షరీఫ్ వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో శాంతి, సౌహార్దం, ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అన్ని మతాలను సమానంగా గౌరవించే భారతదేశ సంస్కృతి విశిష్టమైనదని, ఈ విధమైన కార్యక్రమాలు ప్రజల మధ్య సోదర భావాన్ని మరింత బలపరుస్తాయని అన్నారు.
దర్గా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, దర్గా కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం శాంతియుతంగా, భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ముగిసింది.

# ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన హౌసింగ్

- డిఈ సంపత్ కుమార్, గ్రామసర్పంచ్, ఉప సర్పంచ్
- ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు పెండింగ్ లో ఉన్న బిల్లులు వెంటనే ఇవ్వాలి
- గ్రామ సర్పంచ్ మానిపాటి శోభాకుమార్, ఉపసర్పంచ్ నూకంరాజు ముదిరాజ్

మంచాల వెలుతురు ఏప్రిల్ 07:



మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను హౌసింగ్ అధికారులతో కలిసి పరిశీలించిన గ్రామసర్పంచ్ మానిపాటి శోభాకుమార్ ఉపసర్పంచ్ నూకంరాజు ముదిరాజ్ ఇందిరమ్మకమిటీ సభ్యులు ఇండ్ల నిర్మాణం ఏ లెవెల్ వరకు నిర్మించారో చూసి లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణంత్వరగా పూర్తి చేయాలని చెప్పినా హౌసింగ్ శాఖ అధికారులు ఈసందర్భంగా గ్రామసర్పంచ్ మానిపాటి శోభాకుమార్ ఉప సర్పంచ్ నుకం రాజు ముదిరాజ్ మాట్లాడుతూ ఇందిరమ్మఇండ్ల లబ్ధిదారులు నిర్మించుకున్నఇండ్లకు బిలులు పెండింగ్ లో పెట్టకుండా వెంటనే బిల్లులు ఇవ్వాలని హౌసింగ్ శాఖ అధికారులకు చెప్పడం జరిగింది రెండో విడతలో మంజూరయ్యే ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన నిజమైన పేద కుటుంబాలకు ఇవ్వాలని అధికారులకు చెప్పారు ఈకార్యక్రమంలో హౌసింగ్ శాఖ డిఈ సంపత్ కుమార్ హౌసింగ్ అధికారి ఏ మానస గ్రామపంచాయతీ కార్యదర్శి చిలుకల వెంకటేష్ ఇందిరమ్మకమిటీ సభ్యులు చెరుకు నరసింహ గౌడ్ కంబాలపల్లి బుగ్గ రా ములు మారలక్ష్మణ్ బుట్టి కృష్ణముదిరాజ్ గ్రామస్తులు నూతనగంటి శేఖర్ మార సురేష్ మహమ్మద్ సద్దాం నుకం ప్రవీణ్ ముదిరాజ్ తదితరులుపాల్గొన్నారు

# రోడ్డు సమస్యల పరిష్కారానికి కృషి

- అధికారులతో కలిసి పర్యవేక్షించిన తుంగతుర్తి రవి

మేడిపల్లి వెలుతురు ఏప్రిల్ 07:



మేడిపల్లి 9వ డివిజన్ పరిధిలోని SFS స్కూల్ నుండి పర్వతపూర్ CPRI రోడ్డులోని సాయి ఐశ్వర్య కాలనీ (రోడ్డు నెంబర్ 3) వరకు ఉన్న ప్రధాన రహదారి అధ్వాన్నంగా తయారై, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై స్పందించిన పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆర్.వి ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి ఈరోజు మున్సిపల్ అధికారులు మరియు కాలనీ వాసులతో కలిసి పర్యటించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో ఎన్నిసార్లు రోడ్డు వేసినప్పటికీ, డ్రైనేజీ మరియు వర్షపు నీరు రోడ్డుపైనే నిలిచిపోవడం వల్ల తరచూ గుంతలు పడుతున్నాయని పేర్కొన్నారు. నీరు నిలవకుండా ఉండేందుకు రోడ్డును తగినంత ఎత్తుకు పెంచాలి. నీరు సాఫీగా వెళ్లేందుకు కొత్తగా మ్యాన్ హోల్స్ ఏర్పాటు చేయాలి. నాణ్యమైన పద్ధతుల్లో రోడ్డు నిర్మించి, భవిష్యత్తులో గుంతలు పడకుండా చూడాలని అధికారులతో మాట్లాడి పనులను త్వరితగతిన ప్రారంభించాలని కోరారు.
ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీ వాసులు, మున్సిపల్ అధికారులు మరియు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావుతో అమెరికా, భారత్ వ్యూహాత్మక భాగస్వామ్య ఫోరం ప్రతినిధుల భేటీ

హైదరాబాద్, వెలుతురు ఏప్రిల్ 7:

అమెరికాభారత్ వ్యూహాత్మక భాగస్వామ్య ఫోరమ్ నుండి వచ్చిన ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం మంగళవారం సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామ కృష్ణ రావుతో సమావేశమైంది. ఈ ప్రతినిధి బృందంలో బీమా, ఆర్థిక సేవలు, వ్యవసాయం, సాంకేతిక రంగాలకు చెందిన వివిధ కంపెనీల ప్రతినిధులు ఉన్నారు.
ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వివిధ రంగాల్లో సాధించిన అభివృద్ధిపై ప్రతినిధి బృందానికి వివరించారు. 2014లో దేశంలోనే అత్యంత పిన్న రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణ గత దశాబ్దకాలంలో విశేష పురోగతి సాధించిందని ఆయన తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల నుంచి గణనీయమైన పెట్టుబడుల వలన రాష్ట్ర స్థూల ఉత్పత్తి (GSDP) ఆదాయం గణనీయంగా పెరిగిందని చెప్పారు. భారతదేశంలో నగరీకరణ వేగంగా జరుగుతున్న రాష్ట్రాలలో తెలంగాణ ఒకటని, దాదాపు మూడో వంతు జనాభా హైదరాబాద్, దాని పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్నారని ఆయన అన్నారు. హైదరాబాద్‌ను దేశంలోనే ఔషధ రాజధానిగా, సమాచార సాంకేతిక రంగంలో రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల వల్ల రక్షణ రంగ స్టార్టప్‌ల అభివృద్ధికి కూడా దోహదపడిందని చెప్పారు.
అలాగే గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు (GCCs) లో హైదరాబాద్ భారీ పెట్టుబడులను ఆకర్షించిందని, దేశంలో పేరుగాంచిన విద్యాసంస్థలు, ప్రపంచ స్థాయి ఆరోగ్య సదుపాయాలు, బలమైన ఫిన్‌టెక్ పరిసర వ్యవస్థ ఇక్కడ ఉన్నాయని తెలిపారు.
తెలంగాణ రాష్ట్రం పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, సమృద్ధిగా ఉన్న సాంస్కృతిక వారసత్వం, ప్రసిద్ధ వంటకాలు వంటి అంశాలు పెట్టుబడిదారులను ఆకర్షించే ముఖ్య కారణాలని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలలో ఒకటిగా ఉండి, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.
రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడులను ప్రోత్సహించడంలో ప్రతినిధి బృందానికి పూర్తి సహకారం అందిస్తుందని, తెలంగాణను గ్లోబల్ పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు.
ఈ సమావేశంలో పరిశ్రమల డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, మలాచీ బ్రియాన్ నుగెంట్, ఆర్ దీపక్ జోషి, దివదృష్ట్ సింగ్ (అమెరికాభారత్ వ్యూహాత్మక భాగస్వామ్య ఫోరమ్), వివిధ కంపెనీల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



- రామన్నపేట ఎస్ఐ డి.నాగరాజు

రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 07:

మండలంలోని నిదానపల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.రామన్నపేట ఎస్ఐ డి.నాగరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు చేపట్టారు.ఈ సందర్భంగా ఎస్ ఐ నాగరాజు మాట్లాడుతూ సైబర్ నేరాలపై జాగ్రత్తలు,కమ్యూనిటీ పోలీసింగ్ ప్రాధాన్యం,డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు,చైన్ స్నాచింగ్ నివారణ చర్యలపై గ్రామస్తులకు వివరించారు.అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే పోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తూ చిన్నారుల రక్షణలో సమాజ బాధ్యతను గుర్తుచేశారు. బాల్య వివాహాల నివారణపై చట్టపరమైన అంశాలను వివరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద ఘటనలను వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది నరసింహ,సురేష్,మధు, గ్రామస్తులు,యువత పాల్గొన్నారు

## ఉప్పరపల్లి లో ఘనంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం..



- బిజెపి పార్టీలో భారీ చేరికలు.....

రాజేంద్రనగర్ వెలుతురు ఏప్రిల్ 07:

భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజేంద్రనగర్ నియోజకవర్గం హైదర్ గూడ డివిజన్ ఉప్పరపల్లిలో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్రరావు , ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు.
అనంతరం బొక్క బాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఉప్పరపల్లి ప్రాంతానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు మరియు వారి అనుచరులు పెద్ద ఎత్తున భారతీయ జనతా పార్టీలు పార్టీలో చేరారు.
ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు గారు మాట్లాడుతూ, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో యువత పెద్ద ఎత్తున బీజేపీ వైపు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో పార్టీని మరింత బలోపేతం చేయడంలో యువత కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని, నాయకులు యువశక్తిని సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పలుగుచెరువు నరేందర్ గారు బీజేపీలో చేరగా, వారితో పాటు రాకేష్ లింగాల, పీట్ల రవీందర్, కిరణ్ ఆదిరాల, ఆదిరాల రాజ్ కుమార్, అమీర్‌పేట్ మధు, పీట్ల మహేష్, రాజేష్ పేట, తరుణ్ మద్యపాగా, మనోజ్ ఆదిరాల, మనోజ్ సన్న, కొల్లిపాక సాయి, శివ ఈదులకంటి, సాయి రాజ్ దర్గా, విశాల్ ఆదిరాల, నాగేంద్ర (బాబీ), లక్ష్మణ్ తమ్మిశెట్టి, రాము తమ్మిశెట్టి, సిద్దు కొయడ, మనోజ్ (బన్నీ), విజయ్ పేట, చంద్రకాంత్ తదితరులు బీజేపీ పార్టీలో చేరారు.



హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 07:

మంగళవారం రోజున హిమాయత్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి రామన్ గౌడ్ జలమండలి మేనేజర్ మునవార్ ని కలిసి డివిజన్లోని వివిధ బస్తీలలో ఉన్న సమస్యలను వారికి వివరించి వాటిని వెంటనే సరి చేయాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జాకీ, అభిషేక్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంతో మహిళల అభ్యున్నతి



- **ఏకకాలంలో రెండు లక్ష్యాలు సాధిస్తున్న తెలంగాణ ప్రభుత్వం**
- **మంత్రి సీతక్క ఆదేశాలతో సాంప్రదాయేతర వ్యాపారాల్లో మహిళా సంఘాలు**
- **సెంట్రింగ్ యూనిట్ల ఏర్పాటుతో నెలకు లక్ష ఆదాయం**
- **వనజ ఆదర్శంగా తెలంగాణ ఆడబిడ్డలు భిన్న వ్యాపారలను ఎంచుకోవాలి- మంత్రి సీతక్క**

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 07:

సాంప్రదాయ ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా, ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తూ తెలంగాణ ప్రభుత్వ ప్రోత్సహంతో ఒక యువతి తన జీవితాన్ని మాత్రమే కాదు, ఇతరుల జీవితాలను కూడా మార్చుతోంది. గ్రామీణ తెలంగాణ ప్రాంతానికి చెందిన 30 ఏళ్ల కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ పట్టభద్రురాలు పెద్దబుడి వనజ నెలకు సుమారు రూ.1 లక్ష వరకు ఆదాయం సంపాదిస్తూ, మహిళా సాధికారతకు, ఇందిరా మహిళా శక్తి పథక విజయానికి చక్కటి ఉదాహరణగా నిలుస్తోంది.

ఇంజినీరింగ్ ఉద్యోగం వైపు కాకుండా, నిర్మాణ రంగంలో వ్యాపార అవకాశాలను గుర్తించి వ్యాపారవేత్తగా మారిన వనజ, మరికొంత మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న కోటి మహిళలను కోటీశ్వరులుగా తయారు చేయాలి అనే విజన్‌కు అద్దం పడుతోంది.

వనపర్తి జిల్లా, పానగల్ మండలం, బండపల్లి గ్రామానికి చెందిన వనజ ప్రయాణం, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క నేతృత్వంలో అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాల విజయాన్ని ప్రతిబింబిస్తోంది. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (SERP) సీఈఓ దివ్య దేవరాజన్ మార్గదర్శకత్వంలో మహిళలకు సంప్రదాయేతర వ్యాపార రంగాల్లో శిక్షణ ఇవ్వడం ద్వారా కొత్త అవకాశాలు కలుగుతున్నాయి.

సెంట్రింగ్ యూనిట్లు, సిమెంట్ ఇటుకల తయారీ, షియర్ వాల్ నిర్మాణం వంటి నిర్మాణ రంగ కార్యకలాపాల్లో మహిళలకు శిక్షణ ఇవ్వడం ద్వారా వారికి సుస్థిరమైన ఆదాయ వనరులు కల్పిస్తున్నారు. ఈ క్రమంలో, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్‌తో కలిసి SERP రాష్ట్రవ్యాప్తంగా 772 మంది మహిళలకు సెర్ప్ ద్వారా ప్రత్యేక ఉచిత శిక్షణ అందించింది. ఆ శిక్షణ పొందిన వారిలో వనజ ఒకరు. కొత్త వ్యాపారం కావడంతో వనపర్తి డీఆర్డీఓ ఉమాదేవి..వనజ దగ్గరుండి మరి అన్ని సమకూర్చారు. దీంతో వనజ సెంట్రింగ్ వ్యాపారంలో ముందడుగు వేశారు.

202526లోనే ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద 3.5 లక్షలకుపైగా ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్న రాష్ట్ర ప్రభుత్వం, నిర్మాణ సామగ్రిపై పెరుగుతున్న డిమాండ్‌ను గుర్తించి మహిళలను ఈ రంగంలోకి తీసుకురావాలని మంత్రి సీతక్క ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. మహిళలను నిర్మాణ రంగంలో ప్రోత్సహించే లక్ష్యంతో సెంట్రింగ్ పని, ఇటుకల తయారి వంటి వ్యాపారాల వైపు మహిళలకు అవకాశాలు కల్పించాలన్న సీతక్క ఆదేశాలతో మహిళలకు ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు వ్యాపారాలనికి అవసరమైన ఆర్థిక సహకారాన్ని అందిస్తున్నారు.

ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా సాంకేతిక నైపుణ్యాలు, భద్రతా ప్రమాణాలు, నిర్వహణ సామర్థ్యాలు పెంపొందించడమే కాకుండా, సెంట్రింగ్ ప్రక్రియలో మెళుకువలు, నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వడం గురించి అవగాహన కల్పించారు. చెక్క, ఉక్కు, అల్యూమినియం, మాడ్యులర్ సిస్టమ్స్ వినియోగంపై ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చారు.

అంతేకాకుండా, సెంట్రింగ్ యూనిట్ స్థాపన, నిర్వహణకు అవసరమైన మానవ వనరుల ప్రణాళిక, ముడి సరుకుల సమీకరణ, డిజైన్ నుండి అమలు వరకు వర్క్ ఫ్లో నిర్వహణ వంటి అంశాలపై కూడా శిక్షణ అందించారు. డిజైన్ డ్రాయింగ్స్ అర్థం చేసుకోవడం, వనరుల సమర్థ వినియోగం, ఫార్మ్‌వర్క్ అమలు వంటి విషయాల్లో మహిళలను ప్రావీణ్యం కలిగించారు.

శిక్షణ అనంతరం ఆర్థిక సహాయం పొందేందుకు అవసరమైన వసతులు కల్పించారు. వనజ కు బ్యాంక్ లింకేజ్ ద్వారా రూ.20 లక్షల రుణం పొందడంతో తన సెంట్రింగ్ యూనిట్‌ను విజయవంతంగా స్థాపించింది. ప్రస్తుతం వనజ తన గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి 3 సెంట్రింగ్ యూనిట్లను అందిస్తూ ఆదాయం పొందడమే కాకుండా, స్థానికంగా ఇతరులకు ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తోంది.

రాష్ట్రవ్యాప్తంగా శిక్షణ పొందిన 772 మంది మహిళల్లో ఇప్పటివరకు 154 మంది సెంట్రింగ్ యూనిట్లను స్థాపించగా, మరో 16 మంది ప్రధాన్ మంత్రి ఉపాధి సృష్టి పథకం (PMEGP) కింద దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కో సెంట్రింగ్ యూనిట్‌కు సుమారు రూ.4 లక్షల పెట్టుబడి అవసరం కాగా, దీనికి సంబంధించి డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్స్ సిద్ధం చేసి బ్యాంక్ లింకేజ్, ఆర్థిక సహాయం కోసం జిల్లాలకు పంపించారు.

మహిళలను నిర్మాణ రంగంలో ముందుకు తీసుకురావడమే లక్ష్యంగా మంత్రి సీతక్క అధికారులు ప్రత్యేక దిశానిర్దేశాలు జారీ చేయగా, SERP వాటిని సమర్థంగా అమలు చేస్తోంది. హౌసింగ్ శాఖతో సమన్వయం చేసుకుంటూ మహిళలు స్థాపించిన సెంట్రింగ్ యునిట్లకు అవకాశాలు కల్పిస్తున్నారు.

ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధిస్తూ, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు అవుతున్నారు. అవకాశాలను గుర్తించి ముందడుగు వేస్తే గ్రామీణ మహిళలు ఎంతటి విజయాలు సాధించగలరో వనజ వంటి కథలు స్పష్టంగా చెబుతున్నాయి. అయితే వనజ ఆదర్శకంగా తెలంగాణ ఆడబిడ్డలు భిన్న వ్యాపారలను ఎంచుకుంటే కోటి మంది మహిళలు కోటిశ్వరులన్న సంకల్పానికి చేరువ కావడం చాలా సులభమన్నారు మంత్రి సీతక్క. తనకు అన్ని రకాలుగా సహయ సహకారాలందిస్తూ నెలకు రూ. లక్ష వరకు ఆదాయం సంపాదించడానికి దోహదపడ్డ మంత్రి సీతక్క, సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్, సెర్ప్ డైరెక్టర్ జాన్సన్, వనపర్తి డీఆర్డీఓ ఉమాదేవిలకు వనజ కృతజ్ఞతలు తెలిపారు.

# తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ, ఉద్యోగులు,

- **పెన్షనర్ల పెండింగ్ సమస్యలపై విస్తృత సమావేశం**
- **తక్షణ పరిష్కారానికి బి రవి ప్రకాష్ డిమాండ్**





మెద్చల్-మల్కాజిగిరి జిల్లా వెలుతురు ఏప్రిల్ 07:

ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మెన్ / తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ మెద్చల్‌మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు బి. రవి ప్రకాశ్, తెలంగాణ ఎంప్లాయీస్, గెజిటెడ్ ఆఫీసర్స్, టీచర్స్, వర్కర్స్ & పెన్షనర్స్ సంయుక్త చర్య సమితి (TEJAC) ఆధ్వర్యంలో నిర్వహించిన విస్తృత కార్యవర్గ సమావేశానికి హాజరయ్యారు.

**ఈ సమావేశం ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్**

శ్రీ మారాం జగదీశ్వర్ గారి అధ్యక్షతన ముషారంబాగ్, మలక్‌పేట్ సమీపంలోని రెవెన్యూ భవన్ (TRESA)లో జరిగింది.

ఈ సందర్భంగా బి. రవి ప్రకాశ్ ఉద్యోగులు మరియు పెన్షనర్లకు సంబంధించిన పలు కీలక అంశాలపై తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఉద్యోగులు మరియు పెన్షనర్ల పెండింగ్ బిల్లుల పరిష్కారం, కొత్త హెల్త్ స్కీమ్ అమలు, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏల విడుదల, 2వ పే రివిజన్ కమిటీ అమలు వంటి విషయాలను ప్రస్తావించారు. అలాగే సీపీఎస్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం పైనా దృష్టి సారించారు.

ఇంకా ప్రస్తుత ఉద్యోగులు మరియు పెన్షనర్లకు సంబంధించిన వివిధ సమస్యలు, ఇతర పెండింగ్ డిమాండ్లపై కూడా చర్చించి, వీటిని ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ అంశాలపై సమగ్ర చర్యలు తీసుకోవాలని సమావేశంలో కోరారు.

# ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై దాడి

- **తీవ్రంగా ఖండించిన మాజీ మంత్రి మోతుకుపల్లి నర్సింహులు**
- **ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛకు భంగం కలిగించే చర్యలు ఖండనీయమని**
- **అల్ ఇండియా మీడియా అసోసియేషన్ ప్రెసిడెంట్ డా" సగరపు ప్రసాద్**



హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 07:

హైదరాబాద్‌లోని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) కార్యకర్తలు నిర్వహించిన దాడిని తీవ్రంగా ఖండించిన మాజీ మంత్రివర్యులు మోతుకుపల్లి నర్సింహులు, అల్ ఇండియా మీడియా అసోసియేషన్ ప్రెసిడెంట్ డా "సగరపు ప్రసాద్ గారు తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛకు భంగం కలిగించే ఇటువంటి చర్యలు పూర్తిగా అనవసరమని, ఖండనీయమని ఆయన పేర్కొన్నారు.

మీడియా సంస్థలపై దాడులు జరగడం అత్యంత ఆందోళనకరమని, ఇది ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని మోతుకు పల్లి గారు అన్నారు. ప్రభుత్వాలపై విమర్శలు చేయడం మీడియా హక్కు అని, ఆ హక్కును అణచివేయడానికి చేసే ప్రయత్నాలు ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించబోవని స్పష్టం చేశారు.

దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, రాజకీయ పార్టీలన్నీ దీనిని గౌరవించాల్సిన అవసరం ఉందని మోతుకు పల్లి సూచించారు.

## బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రి డి సి ఎచ్ ఓ అవార్డు



కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) ఏప్రిల్ 7

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా, వివిధ విభాగాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆరోగ్య శాఖ సిబ్బందిని ఆసుపత్రులను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది.

ఈ క్రమంలో, ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యధిక కాన్పులు నిర్వహించిన కామారెడ్డి జిల్లా బాన్సువాడ ఆసుపత్రి ఉత్తమ ఆసుపత్రి గా ఎంపిక చేయబడిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో మంగళవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర రాజ్ నరసింహ చేతులమీదుగా డి సి ఎచ్ ఎస్. డా.విజయ భాస్కర్ రెడ్డి, ఆసుపత్రి సుపరేండెంట్ అవార్డు అందుకున్నారు.

# ఘనంగా లండన్ కిడ్స్ స్కూల్ వార్షికోత్సవాలు

వెలుతురు మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 07:



మహబూబాబాద్ లోని స్థానిక లండన్ కిడ్స్ పాఠశాలలో, 4వ వార్షికోత్సవాలు విద్యార్థుల ఆట పాటలతో, నృత్యాలతో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ బూర పూర్ణ చందర్ గారు మాట్లాడుతూ.. "విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యను బోధించడమే మా పాఠశాల యొక్క లక్ష్యం "అని అన్నాడు.

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా సీఐ చిరంజీవి, డోలి సత్యనారాయణ, బీసీ రాజ్యాధికార సంఘం మహబూబాబాద్ అధ్యక్షులు గండి వీరేందర్, వార్డ్ మెంబెర్స్ జాకీర్, గాడిపెల్లి నాగేశ్వర్ రావు, భూపతి మహేందర్, నాగరాజు, సైకాలజిస్ట్ సుమగారు, రాంబాబు, డోలి శివ, అతిక, పాఠశాల చైర్మన్ బూర తరుణ్ కుమార్, ప్రిన్సిపాల్ లు శరణ్య, హిమ బిందు, మీనాక్షి అకాడమిక్ ఇంచార్జ్ గాడిపెల్లి సుమన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఏబీఎన్, ఆంధ్రజ్యోతి కార్యాలయంపై దాడి

- **తీవ్రంగా ఖండించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్**

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 07:

హైదరాబాద్‌లోని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) కార్యకర్తలు నిర్వహించిన దాడిని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛకు భంగం కలిగించే ఇటువంటి చర్యలు సరి కాదని, ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.మీడియా సంస్థలపై దాడులు జరగడం అత్యంత ఆందోళనకరమని, ఇది ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రభుత్వాలపై విమర్శలు చేయడం మీడియా హక్కు అని, ఆ హక్కును అణచివేయడానికి చేసే ప్రయత్నాలు ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించబోవని స్పష్టం చేశారు.

దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, రాజకీయ పార్టీలన్నీ దీనిని గౌరవించాల్సిన అవసరం ఉందని మహేష్ కుమార్ గౌడ్ సూచించారు.

# హిందూ సమ్మేళన గోడ ప్రతి ఆవిష్కరణ


తిమ్మాపూర్ వెలుతురు ఏప్రిల్ 07:



తిమ్మాపూర్ మండలం పర్లపల్లి ఉప మండలం నల్లగొండ శ్రీ సీతారామ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఈనెల 11న జరగబోయే హిందూ సమ్మేళన గోడ ప్రతిని మంగళవారం సాయంత్రం ఆవిష్కరించారు. సామాజిక సమరత తెలంగాణ ప్రాంత సభ్యులు పుల్లూరి రామారావు , శ్రీ సీతారామ లక్ష్మీనరసింహస్వామి హిందూ సమ్మేళన నిర్వహణ సమితి బాధ్యులు హిందూ సమ్మేళన పోస్టర్ ను ఆవిష్కరించి మాట్లాడారు. 11న శ్రీ సీతారామ లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన ప్రాంగణంలో తలపెట్టిన హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. దేశానికి ఆత్మ హిందూ ధర్మం మని , హిందూ సంస్కృతి, హిందూ సమాజాన్ని చైతన్యవంతం చేసి సమైక్యపరచడానికే హిందూ సమ్మేళనం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. , హిందువులు ఎదుర్కొంటున్న అనేకసవాళ్లనుపరిష్కరించుకోవడానికి ఐక్యమత్యంతో ముందుకొనసాగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి హిందువులో ఆత్మవిశ్వాసాన్ని, ఐకమత్యాన్ని నింపడం, దేవాలయ వ్యవస్థ పటిష్టం చేయడం, సమాజంలో సామాజిక సమరతను నిర్మాణం చేయడం, కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయడం, స్వదేశీ వస్తువుల వాడకాన్ని ప్రోత్సహించడం, జాతీయ భావాన్ని పెంపొదించడం కోసం హిందూ సమాజం ఐక్యతతో ముందు కొనసాగేలా చేయడమే హిందూ సమ్మేళన ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక సమరత తెలంగాణ ప్రాంత సభ్యులు పుల్లూరి రామారావు, హిందూ సమ్మేళన నిర్వహణ సమితి అధ్యక్షులు బోనాల మోహన్ ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్ , చింతం శ్రీనివాస్ , తిరుపతి రెడ్డి, కొయ్యడ శ్రీనివాస్ , ఓదెలు లతో పాటు ముఖ్య అతిథులుగా, నల్లగొండ గ్రామ సర్పంచ్ జినుక మారత్ గారు, పర్లపల్లి గ్రామ సర్పంచ్ సూరం స్వప్నమహేందర్ రెడ్డి, మట్టపల్లి గ్రామ సర్పంచ్ గాండ్ల శ్రీనివాస్ , మల్లాపూర్ గ్రామ సర్పంచ్ మామిడి మమత సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# డ్రింకింగ్ వాటర్ మానిటరింగ్ సెల్ ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) ఏప్రిల్ 7



మంగళవారం జిల్లా కలెక్టరేట్ లోని రూమ్ నెం. 25లో ఏర్పాటు చేసిన డ్రింకింగ్ వాటర్ మానిటరింగ్ సెల్ ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో త్రాగునీటి సమస్యలు తలెత్తిన పక్షంలో ప్రజలు వెంటనే స్పందించేందుకు ఈ మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

ఈ సెల్‌కు సంబంధించిన టోల్ ఫ్రీ నంబర్ 9908712421 ను ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడైనా త్రాగునీటి సమస్యలు ఉన్న యెడల ప్రజలు ఈ నంబర్‌కు సంప్రదించి తమ సమస్యలను తెలియజేయవచ్చని తెలిపారు.

ఈ మానిటరింగ్ సెల్ తేది 07.04.2026 నుండి తేది 30.06.2026 వరకు పని చేస్తుందని, ప్రతి రోజు ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకొని త్రాగునీటి సమస్యలను త్వరితగతిన పరిష్కరించుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

ఇందులో ఇండస్ట్రీ ఆఫీసర్ లాలు, ఎస్ సి,కార్పొరేషన్ వెంకటశ్వర్లు, డి ఎల్ పి ఓ శ్రీనివాస్, మెప్మా శ్రీధర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.


## ట్రంప్ ఫైనల్ వార్నింగ్



వాషింగ్టన్ వెలుతురు ఏప్రిల్ 07:

ఇరాన్‌ను ఉద్దేశించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తీవ్ర హెచ్చరికలు చేశారు. ఈ రాత్రితో ఒక నాగరికత మొత్తం అంతమైపోతుందని, దానిని మళ్లీ ఎన్నటికీ పునరుద్ధరించలేరని 'ట్రూత్ సోషల్' వేదికగా పోస్టు పెట్టారు. అలా జరగాలని తాను కోరుకోవడం లేదని.. కానీ అదే జరిగేలా ఉందన్నారు. 47 ఏళ్ల దోపిడీ, అవినీతి అంతమవుతాయని చెప్పారు. అయితే, ఇరాన్‌లో కొత్త, తెలివైన నాయకత్వం వచ్చిందని, దాని వల్ల అద్భుతాలు జరగవచ్చేమోనని పేర్కొన్నారు.

## ట్రిపుల్‌ఆర్ భూసేకరణలో వేగం




భువనగిరి వెలుతురు ఏప్రిల్ 07:

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రాంతీయ వలయ రహదారి భూసేకరణలో జిల్లా యంత్రాంగం వేగం పెంచింది. భువనగిరి మండలం మినహా మిగిలిన అన్ని మండలాల్లో భూ సేకరణ కొలిక్కి వచ్చింది. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.వెంకారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని గ్రామాల వారీగా రైతులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. రైతులకు నచ్చజెప్పి భూములు ఇప్పించే పనిలో ఉన్నారు.

ఉత్తర భాగంలో జిల్లా మీదుగా సుమారు 60 కిమీ మేర ట్రిపుల్ ఆర్ వెళ్లనుంది. భువనగిరి మండలం రాయగిరి, చౌటుప్పల్లో జంక్షన్లు రానున్నాయి. ఇందుకోసం. 2,588 ఎకరాలను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తుర్కపల్లి మండలం వీరారెడ్డిపల్లిలో ప్రారంభయ్యే ట్రిపుల్ ఆర్ యాదగిరిగుట్ట, భువనగిరి, వలిగొండ, చౌటుప్పల్ మీదుగా వెళ్తుంది. యాదగిరిగుట్ట, తుర్కపల్లి మండలాల భూసేకరణ క్రతువు దాదాపు తుది అంకానికి చేరుకుంది. 19.19 కి.మీ.కు 540 ఎకరాలు సేకరించి అవార్డు కూడా పాస్ చేశారు. మల్లాపూర్లో పెండింగ్లో ఉంది. 290 ఎకరాలు సేకరించి 674 మంది రైతులకు రూ.57 కోట్లు చెల్లించారు. మిగిలిన వారికి పరిహారం చెల్లించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

భువనగిరి మండలంలో రాయగిరి, కేసారం, పెంచికలపహాడ్, తుక్కాపూర్, గౌస్నగర్, ఎర్రంబల్లిలో 484 ఎకరాల సేకరణ జరగాల్సి ఉంది. కోర్టు కేసుతో ఆగింది. ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వచ్చినా రైతులు అభ్యంతరం చెప్పడంతో ఆగింది. ప్రస్తుతం కేసారం, పెంచికలపహాడ్లో సర్వే పూర్తయ్యింది. అవార్డు కూడా పాస్ చేశారు. రాయగిరి మినహా మిగిలిన మండలాల్లో సర్వే కొనసాగుతోంది. ఇప్పటి వరకు ఎక్కడా రైతులకు డబ్బులు చెల్లించలేదు.

వలిగొండ, చౌటుప్పల్ పరిధిలో 25.47 కిమీ రహదారి కోసం భూసేకరణ వేగంగా సాగుతోంది. ఈ రెండు మండలాల్లో 983 మంది రైతుల నుంచి 784 ఎకరాలు సేకరించేందుకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఇప్పటికే 118 ఎకరాలకు అవార్డు పాస్ చేసి 361 మంది రైతులకు రూ.64 కోట్లు చెల్లించారు. సుమారు 2,588 మంది రైతుల నుంచి సుమారు రెండు వేల ఎకరాలు సేకరించాలని ఎన్హెచ్ఎఐ అధికారులు అభ్యర్థన ఇచ్చారు. 1289 ఎకరాలకు రూ.532 కోట్ల పరిహారం చెల్లించేందుకు అవార్డు పాస్ చేశారు. ఇప్పటి వరకు 409 ఎకరాలకు 1035 మంది రైతులకు రూ.121.46 కోట్ల పరిహారం వారి ఖాతాల్లో జమ చేశారు.

**పరిహారం పెంపునకు రైతుల అభ్యర్థన**

పరిహారం తీసుకున్న తుర్కపల్లి, యాదగిరిగుట్ట, వలిగొండ మండలాలకు చెందిన రైతులు పరిహారం పెంపునకు దరఖాస్తు చేసుకోగా జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి నిర్వాసితులతో సంప్రదింపులు జరుపుతున్నారు. రైతులతో చర్చించి తనకున్న పరిగి మేరకు పరిహారం పెంచుతూ ఎన్హెచ్ఎఐ సిఫార్సు చేస్తున్నారు. రైతులను ఒపి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

## శోభనాద్రిపురం నీర్నేముల గ్రామాల సమస్యలు పరిష్కరించాలి.



- **సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య**
- **సిపిఎం పోరుయాత్ర సందర్భంగా పలు సమస్యల పరిశీలన**

రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 07:

శోభనాద్రిపురం, నీర్నేముల గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలపై ప్రభుత్వ యంత్రాంగం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి సమస్యలు పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం పోరు యాత్రలో భాగంగా శోభనాద్రిపురం, నీర్నేముల గ్రామంలో స్థానిక సిపిఎం నాయకులతో కలిసి సమస్యలు పరిశీలన చేయడం జరిగింది. ఈ సందర్భంగా శోభనాద్రిపురం గ్రామంలో వడ్డెవాగుపై వంతెన నిర్మాణం చేయకపోవడంతో వందలాది మంది రైతులకు ఇబ్బందికరంగా మారిందని అన్నారు. స్మశాన వాటికకు ప్రధాన రహదారి కావడంతో చావుల సమయంలో మోకాళ్ళ లోతు నీళ్ల నుండి నడుచుకుంటూ పోవాల్సిన దుస్థితి ఏర్పడిందని అన్నారు.నీర్నేముల గ్రామంలో మంచినీటి ఓవెచ్ఆర్ ట్యాంకు నిచ్చెన శిథిలావస్థకు చేరినది. సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికీ పట్టించుకోవడంలేదని గ్రామానికి అంతటికి ప్రధాన నీటి వనరు అయిన ట్యాంకును కడిగే పరిస్థితి లేదని అన్నారు. దాని మూలంగా ప్రజారోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని పలుమార్లు విన్నవించిన అధికారులు పట్టించుకోవడంలేదని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ప్రారంభించి రైతులకు నష్టం జరగకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ సర్పంచ్ బోయిని ఆనంద్,మండల కమిటీ సభ్యులు ఎండీ రషీద్, మాజీ వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్, శాఖ కార్యదర్శిలు గోగు లింగస్వామి, నాగటి లక్ష్మణ్,మేడి ముకుంద,కొమ్ము అంజయ్య, ఎండీ లతీఫ్, నాగటి అంజయ్య, పాల్వాయి చంద్రశేఖర్ రెడ్డి, వడ్లకొండ రమేష్,బోడిగే వెంకటేష్, నరేష్,బోయిని మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## అధిక ఫీజులపై విచారణ... చర్యలు ఉంటాయా?

నార్కట్ పల్లి వెలుతురు ఏప్రిల్ 07:




"మీ సేవ" కేంద్రంలో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై నల్గొండ టాస్క్‌ఫోర్స్ టీమ్, తహసీల్దార్ బృందం విచారణ చేపట్టింది. ఈ విచారణలో నిజంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నట్లు తేలినట్టు సమాచారం.

అయితే, ఈ అంశంపై అధికారుల నుంచి కఠిన చర్యలు తీసుకుంటారా? లేక తూతూ మంత్రంగా విచారణ చేసి వదిలేస్తారా అన్నది చూడాలి.

# బైరోనిబండ నక్కలపల్లి మధ్య నూతన బిటి రోడ్డు

- **పనులకు శంకుస్థాపన చేసిన భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి**

తుంగతుర్తి నియోజకవర్గం వెలుతురు ఏప్రిల్ 07:





గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రోడ్డు సౌకర్యాలే కీలకమని, అందుకే మారుమూల గ్రామాలకు కూడా బిటి రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నామని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

మంగళవారం నాడు బైరోనిబండ గ్రామంలో బైరోనిబండ నుండి నక్కలపల్లి వరకు మంజూరైన నూతన బిటి రోడ్డు నిర్మాణ పనులకు ఎంపీ గారు శంకుస్థాపన (భూమి పూజ) చేశారు.

తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామెల్ మరియు నల్గొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు.

**ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ*:**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ రోడ్డు నిర్మాణ పనుల ద్వారా బైరోనిబండ మరియు నక్కలపల్లి గ్రామస్తులకు రవాణా కష్టాలు తీరనున్నాయని తెలిపారు. నిర్ణీత కాల వ్యవధిలో నాణ్యతతో ఈ పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని, నియోజకవర్గ వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయిస్తున్నామని వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ యాదయ్య గారు, జిల్లా సీనియర్ నాయకులు దండా అశోక్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పార్టీ శ్రేణులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పార్టీ నిధి సేకరణలో పాల్గొన్న సురిగి చలపతి గౌడ్

మునుగోడు వెలుతురు ఏప్రిల్ 07:

భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పార్టీ నిధి సేకరణ కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు చలిమెడ గ్రామపంచాయతీ పరిధిలోని బొత్తల గూడెం లో

**ఇంటి ఇంటికి తిరిగి విరాళాలు సేకరించడం జరిగినది**

ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురజరామచంద్రం మాట్లాడుతూ నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తున్న పార్టీని బడుగు బలహీన వర్గాల పేద ప్రజలే



కాపాడుకోవాలని అన్నారు

నాటి నుండి నేటి వరకు ఎర్రజెండా నీడలో అణగారిన వర్గాల హక్కుల కోసం పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టుల పూర్తి చేయడం కోసం పేదవాడికి కూడు గూడు నీడ కోసం అనేక ప్రజా ఉద్యమాలు నిర్మించిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కి ఉందని అన్నారు

ఈ కార్యక్రమంలో సిపిఐజిల్లా సమితి సభ్యులు సురిగిచలపతి బొమ్మ ర బోయిన లాలు మండల పార్టీ కార్యదర్శి చాపల శ్రీను గ్రామ సర్పంచ్ బండమీది యాదయ్య శాఖ కార్యదర్శి నందిపాటి అశోక్ మంత నరసింహ వనం దాసు వనం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు

## రామన్నపేటఅమ్మానబోలు పల్లెవెలుగు బస్సును పునరుద్దరించాలి.

- **బస్సులు లేక విద్యకు దూరమవుతున్న విద్యార్థులు.**
- **మునిపంపుల గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం**
- **ఆర్టీసీ రీజినల్ మేనేజర్ కు వినతి**

రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 07:



రామన్నపేట అమ్మనబోలు రూట్లో పల్లె వెలుగు ఆర్టీసీ బస్సులు పునరుద్ధరించి ప్రజలు, విద్యార్థుల సమస్యను,పరిష్కరించాలని మునిపంపుల గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం ఆర్టిసి అధికారులను డిమాండ్ చేశారు. నల్లగొండ రీజినల్ మేనేజర్ జానీరెడ్డికి ఆర్ఎం కార్యాలయంలో వినతిపత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా నిత్యం ఆర్టీసీ బస్సు సేవలు అందించి అనేక మందికి ప్రయాణానికి సుమగంగా ఉన్న బస్సు గత రెండు సంవత్సరాలు నుండి నడవకపోవడంతో విద్యార్థులు గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దుబ్బాక, మునిపంపుల పల్లివాడ, ఎన్నారం, బాచుప్పల సూరారం, తుర్కపల్లి గ్రామాల ప్రజలు నిత్యం అనేక అవసరాలు రీత్యా రామన్నపేట మండల కేంద్రానికి వస్తుంటారు. సుమారుగా 500 మంది విద్యార్థులు మండల కేంద్రంలో ఇతర ప్రాంతాల్లో విద్యాసంస్థల్లో విద్యనభ్యసిస్తున్నారు. కనీసం బస్సు సౌకర్యం లేక ప్రయివేటు వాహనాలను ఆశ్రయించి రోజుకు వంద రూపాయలు ఆర్థిక భారం మోయలేక అనేక మంది విద్యార్థులు చదువు బందు చేసి విద్యకు దూరమవుతున్నారు. భద్రత కరువై ప్రమాదాలకు గురవుతూ ప్రాణాలు కోల్పోతున్నారు. సుమారుగా తొమ్మిది గ్రామాలకు కనీసం పల్లె వెలుగు బస్సు రాకపోవడం అభివృద్ధికి తిరోగమానమని సమస్యను గుర్తించి వెంటనే రామన్నపేటఅమ్మనబోలు రూట్లో పల్లెవెలుగు బస్సును పునరుద్దరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు గంటెపాక శ్రీను, మాజీ వార్డు సభ్యులు బూడిద బిక్షం, సంజీవ, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు గంటెపాక శివ కుమార్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గుండాల నరేష్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్ కుమార్, శ్రీకృష్ణ, నకిరేకంటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారాని కై పాలకులు చొరవ చూపాలి.

- **సిపిఎం**

రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 07:




గ్రామాలలో నెలకొని ఉన్న ప్రజా సమస్యల పరిష్కారానికై పాలక ప్రజాప్రతినిధులు అధికారులు చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెల్లెల పెంటయ్య అన్నారు. సిపిఎం పోరుబాట కార్యక్రమంలో భాగంగా నీర్నేముల గ్రామంలో మంచినీటి ట్యాంక్ ను పరిశీలించి, వారు మాట్లాడుతూ మంచినీటి ట్యాంక్ కు మెట్లు ఏర్పాటు చేయాలని శిధిలావస్థకు చేరిన మెట్ల వల్ల శుభ్రపరచడానికి వీలు లేకుండా పోయిందని శాశ్వత పరిష్కారం దిశగా ప్రజా ప్రతినిధులు అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వ్యవసాయ మార్కెట్లో వడ్ల రాశులను పరిశీలన చేసి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని ఇప్పటికే వాతావరణం ఉరుములు, మెరుపులతో, ఈదురు గాలులు వీయడం జరుగుతుందని అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు బోయిని ఆనంద్ మాజీ ఎంపిపి నాగటి ఉపేందర్, సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి నాగటి లక్ష్మణ్ నాయకులు మేడి ముకుంద,బోయిని మల్లేశం, నాగటి అంజయ్య, పాల్వాయి చంద్రశేఖర్ రెడ్డి, నాగటి రవి, ఏశబోయిన ముత్యాలు, ఆవుల యాదయ్య, పిట్టల నాగరాజు, యాకన్న రాములమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం



- **పనులను పరిశీలించిన ఎంపీడీవో, ఎ రాములు ఏపీవో పి. వెంకటేశం**

రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 07:

జనంపల్లి గ్రామములో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ వాటర్ హార్వెస్టింగ్ పాండ్ పనులను పరిశీలిస్తున్న యం.పి.డి.ఓ ఎ. రాములు మరియు ఏ.పి.ఓ పి.వెంకటేశం కూలీల సమస్యలు తెలుసుకోవడం జరిగింది. ఇట్టి కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ బంద సరోజ , పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి హామీ కూలీలు తదితరులు ఉన్నారు.

## నేస్తం స్వచ్ఛంద సేవా సంస్థ ఆఫీస్ విజిట్

నార్కట్ పల్లి వెలుతురు ఏప్రిల్ 07:

నేస్తం స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయాన్ని తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, మాజీ స్టేట్ సెక్రటరీ (భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్) డా. మంచాల వరలక్ష్మి సందర్శించారు. ఈ సందర్భంగా BC గురుకుల పాఠశాల ఎంట్రెన్స్ తొలి విడత ఫలితాల్లో సీట్ సాధించిన విద్యార్థులు సూర్య తిరుమల, తారక్ రామ్‌లను అభినందించి ఆశీర్వదించారు.

అలాగే, విద్యార్థుల విజయానికి కృషి చేసిన బహదూర్‌పుర తిరుపతి పరమేశ్వరి, యాకత్‌పుర శైలజ గౌడ్ (ఇంచార్జ్‌లు)లకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో నేస్తం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ హోల్డర్, తెలంగాణ జాగృతి నకిరేకల్ నియోజకవర్గ ఇంచార్జ్ డా. టీజీ లింగం గౌడ్ పాల్గొన్నారు.

## రామన్నపేటఅమ్మానబోలు పల్లెవెలుగు బస్సును పునరుద్దరించాలి.

- **బస్సులు లేక విద్యకు దూరమవుతున్న విద్యార్థులు.**
- **మునిపంపుల గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం**
- **ఆర్టీసీ రీజినల్ మేనేజర్ కు వినతి**

రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 07:






రామన్నపేట అమ్మనబోలు రూట్లో పల్లె వెలుగు ఆర్టీసీ బస్సులు పునరుద్ధరించి ప్రజలు, విద్యార్థుల సమస్యను,పరిష్కరించాలని మునిపంపుల గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం ఆర్టిసి అధికారులను డిమాండ్ చేశారు. నల్లగొండ రీజినల్ మేనేజర్ జానీరెడ్డికి ఆర్ఎం కార్యాలయంలో వినతిపత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా నిత్యం ఆర్టీసీ బస్సు సేవలు అందించి అనేక మందికి ప్రయాణానికి సుమగంగా ఉన్న బస్సు గత రెండు సంవత్సరాలు నుండి నడవకపోవడంతో విద్యార్థులు గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దుబ్బాక, మునిపంపుల పల్లివాడ, ఎన్నారం, బాచుప్పల సూరారం, తుర్కపల్లి గ్రామాల ప్రజలు నిత్యం అనేక అవసరాలు రీత్యా రామన్నపేట మండల కేంద్రానికి వస్తుంటారు.సుమారుగా 500 మంది విద్యార్థులు మండల కేంద్రంలో ఇతర ప్రాంతాల్లో విద్యాసంస్థల్లో విద్యనభ్యసిస్తున్నారు. కనీసం బస్సు సౌకర్యం లేక ప్రయివేటు వాహనాలను ఆశ్రయించి రోజుకు వంద రూపాయలు ఆర్థిక భారం మోయలేక అనేక మంది విద్యార్థులు చదువు బందు చేసి విద్యకు దూరమవుతున్నారు. భద్రత కరువై ప్రమాదాలకు గురవుతూ ప్రాణాలు కోల్పోతున్నారు. సుమారుగా తొమ్మిది గ్రామాలకు కనీసం పల్లె వెలుగు బస్సు రాకపోవడం అభివృద్ధికి తిరోగమానమని సమస్యను గుర్తించి వెంటనే రామన్నపేటఅమ్మనబోలు రూట్లో పల్లెవెలుగు బస్సును పునరుద్దరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు గంటెపాక శ్రీను, మాజీ వార్డు సభ్యులు బూడిద బిక్షం, సంజీవ, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు గంటెపాక శివ కుమార్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గుండాల నరేష్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్ కుమార్, శ్రీకృష్ణ, నకిరేకంటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## రవాణా శాఖ లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఎన్ఫోర్స్మెంట్ పెంచి ఆదాయాన్ని పెంచాలి



- ఆదాయం లో టార్గెట్ రీచ్ అయిన పలు జిల్లాల రవాణా శాఖ అధికారులకు అభినందనలు..
- పలువురు అధికారులు పని తీరు మెరుగుపర్చుకోవాలని హెచ్చరిక
- సారథి 8 నెలల్లోనే దేశంలోనే తెలంగాణ ప్రథమ స్థానంలో నిలిచింది.
- వాహన్ పోర్టల్ డేటా పూర్తిచేసుకొని టెక్నికల్ సమస్యలు లేకుండా చూసుకోవాలి
- జూన్ 1 కి ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్ ప్రారంభించుకునేలా పనులు వేగవంతం చేయాలి
- ఏఎంవిఐ లకు ఇచ్చిన శిక్షణ మాదిరి ఇతర రవాణా శాఖ అధికారులకు విడతల వారిగా శిక్షణ ఇవ్వాలి
- రోడ్డు ప్రమాద మరణాలు తగ్గించడానికి రహవీర్ స్కీమ్, క్యాష్ లెస్ ట్రీట్మెంట్ పై ప్రజలకు అవగాహన కల్పించాలి
- 17 జిల్లాలో రవాణా శాఖ కార్యాలయాలకు స్థలాలను గుర్తించాలి
- అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- రవాణా శాఖ రాష్ట్ర స్థాయి సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 07:

రవాణా శాఖ లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఎన్ఫోర్స్మెంట్ బలోపేతం చేస్తూ ఆదాయాన్ని పెంచుకునేలా చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. సచివాలయంలో రవాణా శాఖ అధికారులతో రాష్ట్ర స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. 202425 లో రవాణా శాఖ 6910.90 కోట్లు ఆదాయం వసూలు కాగా ,202526 లో 7097 .38 కోట్లు వసూలు చేయడం జరిగింది. ఈవీ పాలసీ ద్వారా రవాణా శాఖ ఆదాయం కొంతమేర తగ్గినట్లు అధికారులు వెల్లడించారు. తగ్గిన ఆదాయాన్ని ఎన్ఫోర్స్మెంట్ బలోపేతం చేస్తూ ఆదాయ మార్గాలు పెంచుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గతంలో ఇచ్చిన టార్గెట్ రీచ్ అయి లైఫ్ టాక్స్ ,త్రైమాసిక టాక్స్ వసూలు లో మంచి పనితీరు కనబరచిన అధికారులను అభినందించారు. పలువురు అధికారులకు పనితీరు మెరుగు పరచుకోవాలని హెచ్చరించారు.

నిజామాబాద్ మహారాష్ట్ర , ఆదిలాబాద్ మహారాష్ట్ర, మెదక్ కర్ణాటక తదితర సరిహద్దు జిల్లాల రవాణా శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆర్టీవో కార్యాలయాల్లో పెండింగ్ లైసెన్స్ ఇతర పౌర సేవలకు ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. రవాణా శాఖ లో అనేక సంస్కరణలు అమలు చేస్తున్నాయి రవాణా సేవలు పారదర్శకంగా సమర్థవంతంగా వాహనదారులకు అందేలా డీలర్ల వద్ద వాహనాల రిజిస్ట్రేషన్ జరుగుతుందనీ రిజిస్టేషన్ విషయంలో వాహనదారులకు ఇబ్బందులు లేకుండా రవాణా శాఖ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. వాహన్ పోర్టల్ ద్వారా సేవలు డేటా పూర్తిచేసుకొని టెక్నికల్ సమస్యలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. సారథి అమలు లోకి వచ్చిన తర్వాత 8 నెలల్లోనే దేశంలో తెలంగాణ ప్రథమ స్థానంలో నిలిచిందని హర్షం వ్యక్తం చేశారు. ఏఎంవీఐ లకు ఇచ్చిన శిక్షణ మాదిరి ఇతర రవాణా శాఖ అధికారులకు విడతల వారిగా శిక్షణ ఇవ్వాలనీ అధికారులకు సూచించారు.రవాణా శాఖ గౌరవాన్ని పెంపొందించేలా అధికారులు పని చేయాలని సూచించారు. రవాణా శాఖ లో తమ పరిధిలో పరిష్కారమయ్యే సమస్యలు పూర్తి చేసి ఇతర సమస్యలు కమిషనర్ లేదా తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు.

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఈనెల 13 నుండి నిర్వహించే అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని పోలీస్ ,రవాణా శాఖ సమన్వయంతో విజయవంతం చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో అతి వేగం ,మద్యం సేవించి వాహనాలు నడపడం,ఆటోల ఓవర్ లోడ్ ,సీటు బెల్టు పెట్టుకోకపోవడం , హెల్మెట్ లేకపోవడం లాంటి వల్ల మరణాలు సంభవిస్తున్నాయని వాటిపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈనెల 13 18 మధ్య అరైవ్ అలైవ్ కార్యక్రమంలో 15 నుండి 18 వ తేదీ మధ్యలో ఉమ్మడి జిల్లాల వారిగా రవాణా శాఖ మంత్రి గా తను ,ఆర్టీసీ ఎండీ , డీజీపీ,రవాణా శాఖ కమిషనర్ సంయుక్తంగా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రాష్ట్రంలో 37 ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్ మంజూరు అయ్యాయని జూన్ 1 న తొలి టెస్టింగ్ స్టేషన్ ప్రారంభించుకునేలా పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సంవత్సరం రోడ్డు భద్రతా మాసోత్సవాలు బాగా జరిగాయని కేంద్ర ప్రభుత్వం కూడా అభినందించిందని తెలిపారు. అన్ని జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి రేడియం రిఫ్లెక్టివ్ ను కచ్చితత్వం చేయాలన్నారు. రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణ కోసం కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రభుత్వం దాదాపు ఈవీ పాలసీ తీసుకొచ్చిందని ఇప్పటి వరకు దాదాపు వెయ్యి కోట్లు టాక్స్ మినహాయింపు ఇచ్చిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్క్రాపెజ్ పాలసీ తీసుకొచ్చిందని ఇప్పుడు రాష్ట్రంలో మూడు కేంద్రాలు ఉండగా జిల్లా కేంద్రానికి ఒక ఆర్వీఎస్ఎఫ్ కేంద్రాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వెహికిల్ లొకేషన్ ట్రాకింగ్ సిస్టమ్ నిర్భయ ఫ్రేమ్ అందుబాటులోకి రానుందని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రహవీర్ స్కీమ్ , క్యాష్ లెస్ ట్రీట్మెంట్ లో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తుందని ఎవరికైనా ప్రమాదం జరిగినప్పుడు అత్యవసరంగా హాస్పిటల్ కి తీసుకెళ్లిన వారికి రహవీర్ అవార్డు కింద 25 వేలు బహుమతి అందించనున్నారు. రహవీర్ అమలులోకి వచ్చిన తర్వాత తొలి రహవీర్ నల్గొండ జిల్లాకు చెందిన గణపతి వెంకన్న కి 25 వేల రూపాయల చెక్కు ఇచ్చి అభినందించారు. Pm rahath కింద రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు లక్షా 50 వేల రూపాయల వరకు ఉచిత చికిత్స అందించవచ్చని ప్రజలకు వీటిపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.ఇప్పటి వరకు 25 ప్రాంతాల్లో రవాణా శాఖకు స్థలాలు ఉన్నాయని 17 జిల్లాల్లో రవాణా శాఖ కార్యాలయాలకు స్థలాలు గుర్తించి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకోవాలని ఆదేశించారు. రవాణా శాఖ కార్యాలయాల్లో డ్రైవింగ్ లైసెన్స్,ఆర్సీ పెండింగ్ కార్డులు ఉండడం వల్ల ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక , మైనింగ్ , ఓవర్ లోడింగ్ వాహనాలపై ఎన్ఫోర్స్మెంట్ పెంచాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఈవీ వాహనాల్లో ప్రోత్సాహకానికి ప్రభుత్వ విజ్ఞప్తి తో పలు కంపెనీలు ముందుకు వచ్చాయని ప్రభుత్వ ఉద్యోగులు ఈవి వాహనాలకు బ్రాండ్ అంబాసిడర్ లుగా ఈవి వాహనాల వినియోగాన్ని పెంచాలని సూచించారు.

సమీక్షా సమావేశంలో స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, జెటిసి లు చంద్రశేఖర్ గౌడ్, శివ లింగయ్య, రమేష్, డీటీసీ లు , డీటీవో లు, ఆర్టీవో లు, ఎంవీఐ లు , ఏఎంవీఐ లు పాల్గొన్నారు.



# రాష్ట్ర ప్రభుత్వం ప్రమాదాల నివారణ పై ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తుంది.

- అగ్ని ప్రమాదాల నివారణకై ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలి.
- బంజారాహిల్స్ లోని బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో అగ్ని భద్రత అవగాహన సదస్సు
- ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అగ్నిప్రమాదాల నివారణ పై సదస్సు

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 07:





మంగళవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా బంజారాహిల్స్‌లోని బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అగ్నిమాపక భద్రతపై అవగాహన సదస్సును పెద్ద ఎత్తుగా నిర్వహించబడింది.

రాష్ట్ర రవాణా , బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన అగ్ని ప్రమాదాల్లో సుమారు 150 మంది ప్రాణాలు కోల్పోయారని, దాదాపు రూ.800 కోట్ల ఆస్తి నష్టం సంభవించిందని తెలిపారు. అయితే సమయానుకూల చర్యలతో సుమారు 2000 మంది ప్రాణాలు రక్షించగలిగామని పేర్కొన్నారు. ఈ ప్రమాదాలలో ఎక్కువ భాగం నిర్లక్ష్యం, భద్రతా ప్రమాణాల ఉల్లంఘన, అనుమతుల తర్వాత మార్పులు చేయడం వల్ల జరుగుతున్నాయని అన్నారు.

అగ్ని ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత ముఖ్యమని పేర్కొంటూ, చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రాణ నష్టం, ఆస్తి నష్టాన్ని నివారించవచ్చని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే ఫైర్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ 101, మరియు ఎమర్జెన్సీ స్పందన కోసం 112 నంబర్లకు ఫోన్ చేసి వివరాల అందించాలని సంబంధిత అధికారులు సిబ్బంది సత్వరమే స్పందించడం జరుగుతుందని మంత్రి వివరించారు.

ప్రభుత్వం అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్ డిపార్ట్‌మెంట్, జీహెచ్ఎంసీ, పోలీస్, విద్యుత్ శాఖల సమన్వయంతో చర్యలు చేపడుతోందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు జంట నగరల తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు.

హైదరాబాద్‌లో విద్యుత్ ప్రమాదాలను తగ్గించేందుకు అండర్‌గ్రౌండ్ కేబులింగ్ చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. నగరంలో ఎక్కడైనా ప్రమాదకరంగా వైర్లు కనిపించినా వెంటనే సంబంధిత శాఖలకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గుల్జార్ హౌజ్ వంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రజల సహకారం అత్యవసరమని అన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్లు, గ్యాస్ లీకేజీలు, పరిశ్రమల భద్రతా లోపాలు అగ్ని ప్రమాదాలకు ప్రధాన కారణాలని పేర్కొంటూ, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి కోరారు. అగ్ని భద్రత కు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందని తెలిపారు.

హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ మాట్లాడుతూ, అగ్ని ప్రమాదాల విషయంలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మన్ మాట్లాడుతూ, అగ్ని ప్రమాదాల నివారణలో ముందస్తు జాగ్రత్తలు అత్యంత కీలకమని పేర్కొన్నారు. 99 రోజుల కార్యాచరణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఆసుపత్రులు, విద్యాసంస్థలు, ఇతర ముఖ్య ప్రాంతాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, త్వరలో మాల్స్, కమర్షియల్ సంస్థలు, పరిశ్రమలు, నివాస సముదాయాల్లో కూడా చేపడతామని తెలిపారు.

టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ పాటిల్ విద్యుత్ భద్రతపై అవగాహన కల్పిస్తూ, నాణ్యతలేని వైరింగ్, భద్రతా పరికరాల లేమి మరియు ఎంసీబీలను బైపాస్ చేయడం వంటి చర్యలు అగ్ని ప్రమాదాలకు ప్రధాన కారణాలని తెలిపారు. గృహాలు, షాపులు, పరిశ్రమలలో పిరియాడిక్ సెల్ఫ్ ఆడిట్ చేయాలని, సరైన ఎర్తింగ్ మరియు సేఫ్టీ ఫీచర్స్ కలిగిన పరికరాలను ఉపయోగించాలని సూచించారు.

జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ మాట్లాడుతూ, 15 మీటర్ల లోపు భవనాల్లోనే ఎక్కువ అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయని, అనుమతులకు విరుద్ధంగా సెల్లార్లు, సెట్బ్యాక్‌ల వినియోగం కారణమని తెలిపారు.

జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి మాట్లాడుతూ, ఫైర్ సేఫ్టీ అనుమతులను ఒకసారి తీసుకుని నిర్లక్ష్యం చేయకుండా, ప్రభుత్వ అనుమతుల మేరకు చేపట్టి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా చిన్న జాగ్రత్తలు పెద్ద ప్రమాదాలను నివారించగలవని పేర్కొన్నారు.

జిల్లా ఫైర్ అధికారి వెంకన్న అగ్ని ప్రమాదాల కారణాలు, రకాల అగ్ని, నియంత్రణ విధానాలు, ఫైర్ ఎక్స్టింగ్విషర్ల వినియోగం, ఎవాక్యువేషన్ ప్రణాళికలపై సవివరంగా ప్రజెంటేషన్ ఇచ్చారు.

హైడ్రా ఫైర్ అధికారి శ్రీధర్ అగ్ని ప్రమాదాల సమయంలో సమన్వయ చర్యలు, రిస్క్ మేనేజ్‌మెంట్ పై వివరణ ఇచ్చారు.

మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ అగ్ని ప్రమాదాల్లో గాయాల నిర్వహణపై ప్రజెంటేషన్ ఇచ్చింది. కిమ్స్ ఆసుపత్రి ప్రతినిధులు సీపీఆర్ (CPR) విధానాన్ని ప్రదర్శించారు.

తదనంతరం మంత్రి మరియు అధికారులు అగ్నిమాపక శాఖ ఆధునిక పరికరాలు, ఫైర్ ఫైటింగ్ రోబోట్‌తో కూడిన ప్రత్యక్ష ప్రదర్శనలను, ప్రత్యక్ష కాల్పుల విధానాన్ని వీక్షించారు. కార్యక్రమాన్ని ఇంత పెద్ద ఎత్తున ఏర్పాటు చేసిన సందర్భంగా జిల్లా కలెక్టర్ ను అభినందించారు.

జాయింట్ పోలీస్ కమిషనర్ జోయల్ డేవిస్, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ ప్రియాంక అల, టీజీ ట్రాన్స్‌కో డైరెక్టర్ లత వినోద్, టీజీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ చక్రపాణి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) జితేందర్ రెడ్డి, ఆర్డీఓ సికింద్రాబాద్ సాయిరామ్, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి ప్రవీణ్, గిరిజన సంక్షేమ అధికారి కోటాజీ, బీసీ సంక్షేమ అధికారి అశన్న, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఒడెన్న, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. వెంకటి, జీహెచ్ఎంసీ, హైడ్రా, విద్యుత్, ఫైర్, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు, జిల్లాలోని తహసీల్దార్లు, అలాగే హోటల్స్, హాస్టల్స్, ఆసుపత్రులు, కాలేజీలు, పాఠశాలలు, షాపింగ్ మాల్స్, ఏజెన్సీలు, గోదాములు, పరిశ్రమలు, ఫ్యాక్టరీల ప్రతినిధులు , ఆసుపత్రులు, విద్యాసంస్థలు, వాణిజ్య సముదాయాలు, మాల్స్, ట్రేడర్స్ అసోసియేషన్స్, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్స్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మాడభూషణం గారికి ఇది భూషణమా..??

- పెద్దిరెడ్డి రవికిరణ్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, ఆంధ్ర ప్రదేశ్

ఆంధ్రప్రదేశ్ వెలుతురు ఏప్రిల్ 07:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతి ఉండాలంటూ రాష్ట్ర శాసనసభ తీర్మానం చేసి కేంద్రానికి పంపి అక్కడ ఉభయసభల్లోనూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునఃవిభజన చట్టం 2014 సెక్షన్ 5 సబ్ సెక్షన్ 2 ని సవరిస్తూ ఆమోదింపచేసి రాష్ట్రపతి గారి అంగీకారంతో నోటిఫికేషన్ విడుదలై రాష్ట్ర ప్రజలు ఆనందంగా ఉంటే కొంతమంది మేధావులమని చలామణి అవుతున్న వాళ్లు తమ రోత రాతలతో పొంతన లేని వాదనలతో తమ అక్కసును వెళ్లగక్కటం దురదృష్టకరం.

ప్రొఫెసర్ మాడభూషణం శ్రీధర్ ఆచార్యులు అమరావతి రాజధాని గురించి రాసిన తన వ్యాసంలో తొలుత వికేంద్రీకరణ ఉత్తమమని హైదరాబాద్ కేంద్రీకృత అభివృద్ధి నష్టదాయకమని జగన్ ప్రతిపాదించిన మూడు ప్రాంతాలలో మూడు రాజధానులు మంచి ప్రతిపాదన అంటూనే చివరగా జగన్మోహన్ రెడ్డి గారు ఇటీవల ప్రతిపాదించిన "మావిగన్" కి జై కొట్టారు. అంటే జగన్మోహన్ రెడ్డి గారు చెప్పిన దానికల్లా తానా తందానా అంటం తప్పితే శ్రీధర్ గారికి స్వతంత్ర అభిప్రాయాలు లేకపోవడం వారు రాసిన వ్యాసం వెనక దురుద్దేశాన్ని బట్టబయలు చేస్తోంది. అభివృద్ధి వికేంద్రీకరణ ఉత్తమం అయినప్పుడు మరి మీ రాష్ట్రంలో మీ ముఖ్యమంత్రి హైదరాబాద్ అభివృద్ధి సరిపోతున్నట్లుగా మరో ఫ్యూచర్ సిటీ కడతాను అంటూ ఉవిర్లూర్తుంటే మీరు ఎందుకు మౌనంగా ఉంటున్నారు..?? ఆ కట్టేదేదో వరంగల్లోనూ లేక ఖమ్మంలోనూ కట్టవచ్చు కదా అంటూ సలహాలు ఎందుకు ఇవ్వటం లేదు..??



పెద్దిరెడ్డి రవికిరణ్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, ఆంధ్ర ప్రదేశ్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 12 ఏళ్లుగా రాజధాని లేకపోవడం రాజధాని ఏంటో తేలకపోటం వైఫల్యం కాదా అని ఎత్తి పొడుస్తున్న మీరు దానికి కారకులైన జగన్మోహన్ రెడ్డి గారి వ్యవహార శైలి ఎందుకు తప్పు పట్టలేదు మీ వ్యాసంలో. 2019 ఎన్నికలకు ముందు అమరావతికి కట్టుబడి ఉన్నాను అద్భుతంగా నిర్మిస్తాను అని మాటిచ్చి ముఖ్యమంత్రి అయిన వ్యక్తి మాటతప్పి మడమ తిప్పి మూడు రాజధానులు అంటూ రాష్ట్రానికి ఏ రాజధాని లేకుండా చేయటానికి మీరు ఎందుకు తప్పు పట్టలేదు...??

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని కోసం ఢిల్లీ చక్రవర్తి దగ్గర ఒంగి సలాములు కొడుతున్నారు అని అడుగుతున్న మీరు మరి ఏపీ పునర్విభజన చట్టాన్ని తీసుకొచ్చి రాష్ట్రాన్ని విభజించిన మహారాణి గురించి మరిచారే..?? ఆ మహారాణి మీకు కేంద్ర సమాచార శాఖ కమిషనర్ పదవి ఇచ్చారు కదా... మీరెందుకు మాట్లాడుతారు లెండి..!!

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014 చేసింది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కాదు పార్లమెంట్ అన్న విషయం మీరు మరిచారా..?? ప్రజాస్వామ్య వ్యవస్థలో పార్లమెంట్ సుప్రీమ్ అన్న విషయం మీకు తెలియదా..?? పార్లమెంటులో చేసిన చట్టాలలో మార్పులు చేయాలంటే పార్లమెంట్ లోని చేయాలన్న విషయం లా విద్యను బోధిస్తున్న మీకు తెలియదా..?? ఏపీ పునర్విభజన చట్టం 2014 సెక్షన్ 5లో 10 సంవత్సరాల పాటు తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలకి హైదరాబాది ఉమ్మడి కాపిటల్ గా ఉంటుందని, ఆ తర్వాత తెలంగాణ రాష్ట్రానికి హైదరాబాద్ రాజధానిగా కొనసాగుతుందని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కొత్త రాజధాని నిర్మాణం చేసుకుంటుందని ఉన్నది. ఇప్పుడు చెప్పండి ప్రొఫెసర్ గారు రాజధాని గురించి పార్లమెంట్ చేసిన చట్టంలో ఎందుకుంది..?? తెలంగాణకి హైదరాబాద్ క్యాపిటల్ గా ఉంటుందా లేక వరంగల్ ఉంటుందా లేక కరీంనగర్ ఉంటుందా అని చెప్పటానికి పార్లమెంట్ ఎవరని మీరు ఎందుకు అడగలేదు...?? ఆ స్థానంలో సవరించి ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని అమరావతి అని చేర్చితే మీకు దాంట్లో తప్పు ఎందుకు కనపడుతుంది..?? హైదరాబాద్ రాజధాని అని ఉంటే మీకు తప్పుగా కనపడినప్పుడు అమరావతి రాజధాని అని ఉంటే మీకు తప్పుగా ఎందుకు కనపడుతోంది...?? ఆశ్రిత పక్షపాతమా లేక దృష్టి లోపమా...??

రైతుల పచ్చని పొలాల స్థానంలో భవనాలు నిర్మించడాన్ని తప్పుపడుతున్న మీరు మరి ఏ నగర నిర్మాణం గానీ విస్తీర్ణం గాని రైతుల పొలాలు తీసుకోకుండా జరుగుతుందా...?? హైదరాబాద్ మీ స్వగ్రామం వరంగల్ మీరు ఎంతగానో మెచ్చుకుంటున్న మూడు రాజధానులు ఇప్పుడు కొత్తగా మెచ్చుకుంటున్న మావిగన్... వీటి విస్తరణ నూతన నిర్మాణం రైతుల పొలాలు తీసుకోకుండానే జరుగుతుందా...??


తెలంగాణ నూతన సెక్రటేరియట్ 10 లక్షల చదరపు అడుగులతో నిర్మిస్తే ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ 52 లక్షల చదరపు అడుగులు ఎందుకని అడుగుతున్నా మీరు... అరకొర సమాచారంతో వ్యాసం రాశారని చెప్పక తప్పదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కడుతుంది కేవలం సెక్రటేరియట్ కాదు హెచ్వోడీలు జీఏడి భవనాలు కూడా అని మీకు తెలవక పోవటం దురదృష్టం. జగన్మోహన్ రెడ్డి తన పరిపాలన సమయంలో విశాఖ ఋషికొండపై నిర్మించిన రిషికొండ ప్యాలెస్ కి చదరపు గడుగు 35 వేల రూపాయలు వెచ్చించారు... కానీ ఇప్పుడు అమరావతిలో నిర్మాణం అవుతున్నటువంటి భవనాల ఖర్చు చదరపు అడుగు 7000 మాత్రమే అని మీకు తెలియదా..??

కేవలం అర్ధసత్యాలతో మనకి అనుకూలముగా ఉన్నటువంటి వాదనలు విషయాలు ఎంచుకుంటూ కూర్పు చేసుకుంటూ మీరు రాసిన వ్యాసం మిమ్మల్ని ప్రేరేపించిన పెద్దలు సంతోషించవచ్చు గాని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు చీత్కరించుకుంటున్నారు అన్న విషయాన్ని మీరు గుర్తు పెట్టుకోండి.

# జర్మనీలో ఉద్యోగావకాశాల పై మంత్రి వివేక్ ఉన్నతస్థాయి సమావేశం

హానోవర్, వెలుతురు ఏప్రిల్ 07:


తెలంగాణ కార్మిక, ఉపాధి మరియు గనుల శాఖ మంత్రి డా. జీ. వివేక్ వెంకటస్వామి మంగళవారం జర్మనీలోని హానోవర్ నగరంలో German Federal Employment Agency అధికారులతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర యువతకు విదేశీ ఉపాధి అవకాశాలను విస్తరించే దిశగా ఈ సమావేశం జరిగింది. ఈ చర్చల్లో తెలంగాణ నుంచి జర్మనీకి నైపుణ్యంతో కూడిన మానవ వనరుల పంపిణీ అవకాశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యంగా నైపుణ్య కార్మికుల కొరత ఉన్న రంగాల్లో అవకాశాలను గుర్తించడం పై చర్చించారు. అలాగే జర్మన్ ఉద్యోగ మార్కెట్ అవసరాలను తీర్చేందుకు తెలంగాణ సన్నద్ధత—నైపుణ్య ప్రమాణాలు, భాషా శిక్షణ, సర్టిఫికేషన్ ప్రక్రియలపై సమీక్ష చేపట్టారు.



తెలంగాణ ప్రభుత్వం యువతను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు చేపడుతున్న చర్యలను మంత్రి వివరించారు. ముఖ్యంగా Telangana Overseas Manpower Company వంటి సంస్థల ద్వారా నూతన నైపుణ్యాల్లో శిక్షణ అందిస్తూ, గ్లోబల్ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రతినిధి బృందంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (LETF) ఎం. దానా కిషోర్, టామ్‌కామ్ జనరల్ మేనేజర్ నాగభారతి, మేనేజర్ అనిల్ కుమార్, పీఎంయూ హెడ్ శ్రీనివాస్ రావు, స్కిల్ టాలెంట్ అక్విజిషన్ హెడ్ బాలా రమణి, శ్రీమతి సరోజ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జర్మన్ ఫెడరల్ ఎంప్లాయ్మెంట్ ఏజెన్సీలో ఎర్లీ కెరీర్ కౌన్సెలింగ్ విభాగం అధిపతి లారా బ్రైట్సామీటర్‌ను మంత్రి మరియు ప్రతినిధి బృందం సన్మానించారు.

ఈ సమావేశం ద్వారా తెలంగాణ యువతకు జర్మనీ వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిర్మాణాత్మక మార్గాలను ఏర్పరచడంలో కీలక అడుగు పడినట్లైంది.





# బీస్ట్ మోడ్‌లో బన్నీ

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబోలో సన్ పిక్చర్స్ అంతర్జాతీయ స్థాయిలో సినిమాని నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ AA22 x A6 అంటూ ఇప్పటికే సోషల్ మీడియాలో ఓ ట్రెండ్ క్రియేట్ చేసింది. ఇక ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన అప్డేట్ అల్లు అర్జున్ బర్త్ డే (ఏప్రిల్ 8) సందర్భంగా అందరినీ ఆశ్చర్యపర్చబోతోంది. ఈ క్రమంలోనే తాజాగా AA22 x A6 ప్రాజెక్ట్‌కి సంబంధించిన ప్రీ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ ఒక్క పోస్టర్‌తోనే మేకర్స్ ప్రేక్షకులు, సినీ లవర్స్‌లో ఎన్నో అనుమానాల్ని, ఉత్సుకతను రేకెత్తించారు. ఆ హ్యాండ్ ఎవరిది? ఆ ఆకారం ఏంటి? అది ఎందుకు అలా మారింది? కథ ఎలా ఉండబోతోంది? అని ఇలా అందరిలో రకరకాల ప్రశ్నల్ని లేవనెత్తింది. ఈ ఒక్క ప్రీ లుక్ పోస్టర్ ఇప్పుడు సోషల్ మీడియాని షేక్ చేసేస్తోంది. రేపు ఉదయం 11 గంటలకు అసలు సిసలు అప్డేట్ రాబోతోందని మేకర్లు ప్రకటించారు. టైటిల్‌తో పాటుగా హీరో ఫస్ట్ లుక్ పోస్టర్‌ని కూడా రేపు రివీల్ చేయబోతోన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఈ మూవీని ప్లాన్ చేసిన సంగతి తెలిసిందే. ఇక అల్లు అర్జున్ పుట్టిన రోజు సందర్భంగా సినిమాకు సంబంధించిన టైటిల్, పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌తో అభిమానుల్ని అలరించనున్నారు.



# మహిళలకు “డైమండ్ డెకాయిట్” ఉచితం

ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న కంప్లీట్ ఫ్యామిలీ ఎమోషనల్ డ్రామా “డైమండ్ డెకాయిట్” చిత్రం ఈ నెల ఏప్రిల్ 10న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఘనంగా థియేటర్ లలో విడుదల కాబోతుంది. ఈ సందర్భంగా దర్శకేంద్రుడు కే. రాఘవేంద్ర రావు ట్రైలర్‌ను వీక్షించి చిత్ర బృందాన్ని అభినందించారు. ఈ ప్రత్యేక సందర్భంలో చిత్ర యూనిట్ మహిళా ప్రేక్షకులకు ఆకర్షణీయమైన ఆఫర్‌ను ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో విడుదల కానున్న థియేటర్లలో 4 షోలు మహిళలకు ఉచితంగా ప్రదర్శించనున్నట్లు వెల్లడించింది. మహిళలు ఎక్కువ సంఖ్యలో థియేటర్లకు వచ్చి సినిమా ఆస్వాదించాలని చిత్ర బృందం కోరుతోంది. ఈ చిత్రంలో పార్థా గోపాల్ హీరోగా నటించడమే కాకుండా నిర్మాతగా వ్యవహరించగా, మేఘనా రెడ్డి హీరోయిన్‌గా నటించారు. రచయిత-దర్శకుడు సూర్య జి. యాదవ్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం పూర్తి కుటుంబ వినోదంతో పాటు హృద్యమైన భావోద్వేగాలతో కూడిన ఎమోషనల్ డ్రామాగా తెరకెక్కింది. ఈ సందర్భంగా హీరో-నిర్మాత పార్థా గోపాల్ మాట్లాడుతూ:“డైమండ్ డెకాయిట్ ఒక కంప్లీట్ ఫ్యామిలీ ఎమోషనల్ డ్రామా. ప్రతి కుటుంబం కనెక్ట్ అయ్యేలా కథ ఉంటుంది. కడపలో చిత్రీకరించిన అందమైన లొకేషన్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. మహిళలకు 4 షోలు ఉచితంగా ఏర్పాటు చేశాం. అందరూ థియేటర్లకు వచ్చి సినిమా చూడాలి” అని అన్నారు.



# అల్లరినరేష్ నూతన చిత్రం ‘కనక దుర్గ’

తమిళ సినీ ఇండస్ట్రీలో విజయవంతమైన ప్రముఖ కంటెంట్ స్టూడియో అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇప్పుడు టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. అందులో భాగంగా టెంపుల్ టౌన్ పిక్చర్స్‌తో కలిసి చేయబోతున్న సినిమా ‘కనక దుర్గ’ను శనివారం రోజున పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. వెర్సటైల్ స్టార్ అల్లరి నరేష్ హీరోగా నటిస్తోన్న ఈ సినిమాలో కాజల్ చౌదరి హీరోయిన్. ఈ సినిమాలో నటుడు సుబ్బరాజు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ భక్తి ప్రధాన కథా చిత్రానికి బి.వి.ఎస్. రవి కథ అందిస్తుండగా..ప్రదీప్ మద్దాలి దర్శకత్వం వహిస్తున్నారు. సమీర్ నాయర్, దీపక్ సెహగల్, అజిత్ ఠాకూర్, బి.వి.ఎస్. రవి నిర్మాతలు. భారతీయ దేవతల ఆధారంగా ఒక దివ్యమైన ప్రపంచాన్ని ఆవిష్కరిస్తూ ఈ సినిమా భక్తి, యాక్షన్, భావోద్వేగాలు, సంగీతం ఇలా అన్ని అంశాలతో ప్రేక్షకులకు ఓ అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌ను అందించనుంది. అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమర్పణలో టెంపుల్ టౌన్ పిక్చర్స్ నిర్మాణంలో రూపొందుతోన్న ఈ సినిమా ఈ రెండు సంస్థలకు ఎంతో ప్రత్యేకమైనది. ఘనంగా జరిగిన కార్యక్రమంలో సురేఖ కొణిదెలతో పాటుగా ప్రముఖ నిర్మాతలు అల్లు అరవింద్, శ్యామ్ ప్రసాద్ రెడ్డి, హరీష్ శంకర్, మిక్కిలినేని సుధాకర్, కోన వెంకట్, ప్రశాంత్ వర్మ, మధుర శ్రీధర్, స్వప్నాదత్, సుప్రియ, విద్యా కొప్పినీడు, పద్మ కస్తూరి రంగన్, అనురాధ గూడూరు, దివ్య విజయ్, హన్షిత రెడ్డి, జాన్వీ నారంగ్, స్రవంతి చొక్కారపు, వైఘా రెడ్డి, విరుప తదితరులు అతిథులుగా విచ్చేశారు. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత అల్లు అరవింద్ క్లాప్ కొట్టగా, సురేఖ కొణిదెల కెమెరా స్విచ్ ఆన్ చేశారు. స్వప్న దత్ గౌరవ దర్శకత్వం వహించారు. శ్యామ్ ప్రసాద్ రెడ్డి స్క్రిప్ట్‌ను అందించారు.

# నిర్మాత కేఎస్ రామారావు "అహోం" ప్రారంభోత్సవం

వివేక్ మిశ్రా, శృతిక జంటగా నటిస్తున్న సినిమా "అహోం". ఈ చిత్రాన్ని ఈగల్ ఐ స్టూడియో ఇంటర్నేషనల్ బ్యానర్ పై దశరథ్ నిర్మిస్తున్నారు. ప్రసాద్ రాజు దర్శకత్వం వహిస్తున్నారు. పాన్ ఇండియా భాషల్లో తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళంలో సినిమా తెరకెక్కనుంది. నిర్మాత కేఎస్ రామారావు, డైరెక్టర్ వి.వి.వినాయక్ ముఖ్య అతిథులుగా ఈ చిత్ర ప్రారంభోత్సవం నేడు హైదరాబాద్ లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో నిర్మాత కేఎస్ రామారావు మాట్లాడుతూ డైరెక్టర్ ప్రసాద్ రాజు మంచి అనుభవం ఉన్న వ్యక్తి. ఆయన దర్శకత్వంలో ఈ సినిమా పలు భాషల్లో రూపొందడం సంతోషంగా ఉంది. ఎందుకంటే ఈ రోజు సినిమా ఒక్క భాషలో చేస్తే వర్కవుట్ కావడం లేదు. హిందీతో పాటు దక్షిణాది అన్ని ప్రధాన భాషల్లో "అహోం" సినిమాను రూపొందిస్తున్నారు. బెంగాలీ, మరాఠీ వంటి భాషలతో పాటు ఈ చిత్రానికి ఇంగ్లీష్ లోనూ డబ్ చేయాలని సూచిస్తున్నా. నిర్మాత దశరథ్ కి కంగ్రాట్స్. కొత్త నిర్మాతలు బాగుంటేనే మరిన్ని చిత్రాలు తెరకెక్కి ఇండస్ట్రీ మీద ఆధారపడి ఉన్న వారికి ఉపాధి కల్పిస్తాయి. "అహోం" సినిమా మంచి విజయం సాధించాలని కోరుతున్నా అన్నారు.



# 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' ఫుల్‌లెంగ్త్ ఎంటర్‌టైనర్ ప్రొడ్యూసర్ శివప్రసాద్



వరుస బ్లాక్‌బస్టర్ విజయాలతో అలరిస్తున్న యంగ్ సెన్సేషన్ ప్రదీప్ రంగనాథన్ హీరోగా, విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో రూపొందిన క్రేజీ లవ్ స్టోరీ ‘లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ’. ఈ చిత్రాన్ని నయనతార నిర్మించగా, కృతి శెట్టి హీరోయిన్‌గా నటించారు. ఈ చిత్రంలో ఎస్.జె. సూర్య, యోగి బాబు కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే విడుదలైన తెలుగు టీజర్, ట్రైలర్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. శ్రీ పద్మిని సినిమాస్ ద్వారా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఏప్రిల్ 10న ఈ చిత్రం గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రొడ్యూసర్ శివప్రసాద్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**ప్రొడ్యూసర్‌గా మీ జర్నీ గురించి?**

మొదట శ్రీరామ్‌తో మాతృ సినిమా నిర్మించాం. తర్వాత రారాజా ప్రొడ్యూస్ చేశాం. సుహాసిని మణిరత్నం గారితో మహతి అనే సినిమా చేస్తున్నాం. ఆ సినిమా షూటింగ్‌లో ఇంకా 10% బ్యాలెన్స్ ఉంది. విజయ్ సేతుపతి ఏస్ సినిమాను మేము డిస్ట్రిబ్యూట్ చేశాం. మరాఠీలో ఒక సినిమా తీశాం, అది రిలీజ్‌కు సిద్ధంగా ఉంది. ఆ సినిమాకు డైరెక్టర్, ప్రొడ్యూసర్ నేనే. ఇప్పుడు లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ సినిమాను రిలీజ్ చేస్తున్నాం. గీతాంజలి, మిథున్ చక్రవర్తి గారి డిస్కో డాన్సర్ రీరిలీజ్‌కు సిద్ధంగా ఉన్నాయి. మా తమ్ముడిని పరిచయం చేస్తూ రంగూన్ రాజా అనే సినిమా చేశాం. ఆ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్‌లో ఉంది. జూలైలో రిలీజ్ చేయాలని అనుకుంటున్నాం.

**లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ సినిమా గురించి?**

గత సంవత్సరం ఈ సినిమాకు అగ్రిమెంట్ చేసుకున్నాము. ఈ సినిమా కోసం చాలా మంది ప్రయత్నించారు. కానీ మేమే ముందుగా కమిట్ అయినందున, వాళ్లు మాకు ఇచ్చారు. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. కచ్చితంగా మంచి సక్సెస్ అవుతుందని నమ్మకం ఉంది. దాదాపు 500 స్క్రీన్స్‌లో రిలీజ్ కానుంది. డిస్ట్రిబ్యూషన్ పరంగా మేము సేఫ్‌గా ఉన్నాం. ప్రస్తుతం ఉన్న పరిస్థితులు, ఫ్యూచర్ టెక్నాలజీ ఆధారంగా చేసుకుని డిజైన్ చేసిన స్టోరీ ఇది. టెక్నాలజీ హ్యూమన్ రిలేషన్స్, ఎమోషన్స్‌పై ప్రభావం చూపితే ఎలా ఉంటుందనే విషయం ఈ సినిమాలో ప్రధానంగా ఉంటుంది. టెక్నాలజీ కారణంగా మనుషుల మధ్య సంబంధాలు హార్ట్‌ఫుల్‌గా కాకుండా ఆర్టిఫిషియల్‌గా మారిపోయే పరిస్థితి కనిపిస్తోంది. ప్రదీప్ రంగనాథన్ గారు అద్భుతమైన ఫామ్‌లో ఉన్నారు. అలాగే విగ్నేష్ శివన్ గారు కూడా అద్భుతమైన డైరెక్టర్. అనిరుధ్ రవిచందర్ గారి మ్యూజిక్ ఈ సినిమాకు మరో హైలైట్. తప్పకుండా ఈ సినిమా ఆడియన్స్‌ను ఎంటర్టైన్ చేస్తుందనే నమ్మకం ఉంది. సినిమాకు ఇప్పటికే మంచి రీచ్ వచ్చింది. దిల్ రాజు గారు, అనిల్ రావిపూడి గారు ఈ సినిమా ట్రైలర్ లాంచ్‌కు వచ్చి మాకు ఎంతో సపోర్ట్ చేశారు. కంటెంట్ కూడా కచ్చితంగా ఆడియన్స్‌లోకి వెళ్తుంది. ఇది ఫుల్‌లెంగ్త్ ఎంటర్‌టైనర్.

**కొత్తగా మీరు చేయబోయే సినిమాలు?**

మా తమ్ముడు అజయ్ హీరోగా రంగూన్ రాజా సినిమా చేశాం. అది జూన్ లేదా జూలైలో రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నాం. అలాగే మహతి సినిమా కూడా త్వరలో రెడీ అవుతుంది.

# "తిమ్మరాజుపల్లి టీవీ" ట్రైలర్

న్యూ టాలెంట్ ను ఎంకరేజ్ చేస్తూ హీరో కిరణ్ అబ్బవరం సుమైర స్టూడియోస్ తో కలిసి తన కేఏ ప్రొడక్షన్స్ పై నిర్మిస్తున్న సినిమా "తిమ్మరాజుపల్లి టీవీ". తేజ వేల్పుచర్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంతో సాయి తేజ్, వేద జలంధర్ హీరో హీరోయిన్స్ గా పరిచయమవుతున్నారు. "తిమ్మరాజుపల్లి టీవీ" చిత్రంతో వి.మునిరాజు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. విలేజ్ బ్యాక్ డ్రాప్ లో సాగే పీరియాడిక్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా ఈ నెల 17న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. "తిమ్మరాజుపల్లి టీవీ" సినిమా ట్రైలర్ రిలీజ్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. "తిమ్మరాజుపల్లి టీవీ" సినిమా ట్రైలర్ ఈనెల 9వ తేదీన రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సినిమా ట్రైలర్ పై మూవీ లవర్స్ లో మంచి ఎక్స్ పెక్టేషన్స్ ఏర్పడుతున్నాయి.




# "శిఖండి" టీజర్ లాంచ్

యువరాజ్ గౌడ, నిఖిల్, దీపక్ శెట్టి, ఖ్యాతి, నిఖిత స్వామి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా శిఖండి. ఈ చిత్రాన్ని పోలా మూవీస్ బ్యానర్ పై పోలా ప్రవీణ్ కుమార్ నిర్మిస్తున్నారు. దర్శకుడు గురుమూర్తి.వి. రూపొందిస్తున్నారు. ఈ సినిమా వేసవి విడుదలకు సిద్ధమవుతోంది. హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్ లో ఘనంగా శిఖండి సినిమా టీజర్ రిలీజ్ ఈవెంట్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్టోరీ రైటర్ సత్యదేవ్ మాట్లాడుతూ నాకు రీసెంట్ గా తెలుగు యంగ్ హీరోతో కన్నడ తెలుగు ప్రాజెక్ట్ ఓకే అయ్యింది. ఇప్పుడు ఈ ఈవెంట్ లో కన్నడ మూవీ టీమ్ ను కలుసుకోవడం హ్యాపీగా ఉంది. మహాభారతంలో శిఖండిది చాలా కీలక పాత్ర. భీష్మ పితామహుని అస్త్ర సన్యాసానికి కారణమైన పాత్ర శిఖండిది. ఈ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ కారణజన్ములే. ప్రతి ఒక్కరి జన్మకు కారణం ఉంటుంది. అలాంటి శిఖండి పాత్ర స్ఫూర్తితో తెరకెక్కుతున్న ఈ సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా. అన్నారు.



# రేస్ గుర్రం రీరిలీజ్ ఈవెంట్

రేస్ గుర్రం అనే పేరు వినగానే వచ్చే వైబ్‌నే వేరు. విడుదల సమయంలో ఈ సినిమాకు వచ్చిన క్రేజ్ మాత్రం అసాధారణం. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, శృతి హాసన్‌ల మధ్య సీన్స్ ఒక ఎత్తు అయితే, అల్లు అర్జున్-బ్రహ్మానందం కాంబినేషన్ సన్నివేశాలు మరో లెవెల్‌కు తీసుకెళ్లాయి. అల్లు అర్జున్ బర్త్‌డే స్పెషల్‌గా ఏప్రిల్ 8 న మళ్లీ ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రానికి సురేందర్ రెడ్డి దర్శకత్వం వహించారు. నల్లమలపు శ్రీనివాస్ (బుజ్జి), వెంకటేశ్వర రావు కలిసి శ్రీ లక్ష్మి నరసింహ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మించారు. థమన్ సంగీతాన్ని అందించగా, మనోజ్ పరమహంస సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహించారు. ఈ రీరిలీజ్ బాధ్యతలను క్రౌన్ మూవీస్ తీసుకుని, గ్రాండ్‌గా ఈవెంట్‌ను నేడు నిర్వహించారు.

